



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 253 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ గురువారం 04 జూన్ 2026 పేజీలు : 12 వెల : 2/-




# గొరగనమూడిలో రెండు మీటర్ల నరకం!

## ఇంటింటి నల్లా పథకం నీరుగారగా తాగునీటి కోసం ప్రాణాలు పణంగా పెడుతున్న గ్రామస్తులు




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వాలు ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన "జల జీవన్ మిషన్" లక్ష్యం ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించడమే. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఇంటి వద్దనే నాణ్యమైన తాగునీరు అందించాలని కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎలా ఉన్నాయో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలం, గొరగనమూడి గ్రామంలోని మెయిన్ రోడ్డు ప్రాంతం, ఎస్సీ కాలనీలో కనిపిస్తున్న దృశ్యాలు చూస్తే అర్థమవుతోంది. కాగితాలపై పూర్తయినట్లు చూపించిన తాగునీటి పథకం ప్రజల జీవితాల్లో మాత్రం తీవ్ర ఇబ్బందులు, ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలను మిగిల్చిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటి ద్వారా నీరు సక్రమంగా రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ల నిర్మాణ సమయంలో సరైన సాంకేతిక ప్రమాణాలు పాటించకపోవడం, అవసరమైన మట్టాలను పరిగణనలోకి తీసుకోకపోవడం, నీటి ఒత్తిడి సరిగా ఉండే విధంగా పనులు నిర్వహించకపోవడం వల్ల ఇప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ఇళ్ల వద్ద నల్లాలు ఉన్నప్పటికీ వాటి నుంచి నీరు రాకపోవడంతో అవి కేవలం పేరుకే ఉన్న కనెక్షన్లుగా మారిపోయాయని గ్రామస్తులు వాపోతున్నారు. తాగునీరు అందించాల్సిన మిగతా .. 2లో..



### ప్రజాస్వామ్యంలో ఎవరైనా..

# ఎక్కడైనా సభలు నిర్వహించుకోవచ్చు

## హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణపై ఏపీ సీఎం చంద్రబాబు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. తెలంగాణలో పవన్ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరి కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా, ఎక్కడైనా సభలు నిర్వహించుకోవచ్చన్నారు. తానూ తమిళనాడుకి వెళ్లి ప్రచారం చేశానని చెప్పారు. "రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్ల సమయం గడిచిపోయింది. ప్రజలకు ఎవరు మంచి చేశారనేది అందరికీ తెలుసు. ప్రజలకు మంచి చేయడంలో నాయకులు పోటీ పడాలి గానీ, ప్రజల మధ్య విభేదాలు తెచ్చేందుకు పోటీపడకూడదు. అభివృద్ధిని లాజికల్‌గా తీసుకెళ్లాలి. అనవసరంగా వివాదాలు సృష్టించడం ఎవరికీ మంచిది కాదు"అని హితవు పలికారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఆరోపణలపై సీఎం స్పందిస్తూ.. డీఎస్సీపై విషప్రచారంతో యువతలో గందరగోళం సృష్టించేందుకు వైకాపా ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. బ్రిడ్జ్ స్పోర్ట్స్‌పై అవగాహన లేకుండా గొడ్డలిపార్టీ నేతలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నోరు, పేపర్, పేటీఎం బ్యాచ్ ఉన్నాయని.. నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజలు వైకాపా గుర్తింపును రద్దు చేసే రోజు దగ్గర్లోనే ఉందన్నారు.

**తెలంగాణలో పవన్‌పై వ్యాఖ్యలను ఖండించిన సీఎం చంద్రబాబు**

తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరైన పద్ధతి కాదని మిగతా .. 2లో..

### తెలంగాణ భూమిపుత్రులే

# పోటీ చేస్తామంటే అభ్యంతరమేంటి?

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పొట్టి శ్రీరాములు త్యాగం వల్లనే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని.. అలాంటి మహానాయకులను కులచట్రాల్లో బిగించడం రాజకీయాల్లో అలవాటుగా మారిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతిలో పర్యటించిన ఆయన.. అక్కడి 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో ఇంకా తెలంగాణ భావోద్వేగం ఉంది. ఏపీలో అలాంటి భావోద్వేగం లేదు. ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన మహానుభావుడిని కులానికి పరిమితం చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చాక కులదూషణ పెరిగింది. నిరుద్యోగం, అభివృద్ధి గురించి పట్టించుకోకుండా కులాల కుంపట్లు పెరిగాయి. ఈ వాతావరణాన్ని అడ్డుకునేందుకే సేనాగళం పేరుతో కమిటీ ఏర్పాటు చేశాం. ఇందులో అన్ని వర్గాల నాయకులు ఉంటారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడి కులం వెనుక దాక్కొనే సంస్కృతి వద్దు. తెలంగాణలో పార్టీ ఆఫీసు తీసేసినా నాయకులు, జనసైనికులు అలాగే ఉన్నారు. నిన్న జరిగిన పరిణామాలతోనే తెలంగాణలో పోటీపై ప్రకటన చేయాల్సి వచ్చింది. దేశ సమగ్రతకు భంగం కలిగించే దేన్నయినా మిగతా .. 2లో..

### తప్పుడు ప్రచారాలు చేస్తే..

# క్రిమినల్ కేసులు తప్పవు

## రాష్ట్ర హోంమంత్రి అనిత



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ నాయకులకు కేవలం సమస్యలు సృష్టించడం, ప్రభుత్వంపై బురదజల్లడమే అలవాటుగా మారిందని, వారికి సమాధానాలు వినే ఓపిక కూడా లేదంటూ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను తీసుకెళ్లి మద్యం దుకాణాల ముందు నిలబెట్టిన ఘనత వారిదేనని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ పరీక్షలపై ఆ పార్టీ నేతలు చేస్తున్న విమర్శల్లో ఎలాంటి నిజం లేదని, గతంలో వారు గ్రూప్-1 పరీక్షలను ఎంత అధ్వానంగా మిగతా .. 2లో..

# అవును, తెలంగాణ మా జాగీరే

## పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు గద్దర్ కూతురు కౌంటర్
## తెలంగాణ గడ్డ నిన్న, నేడు, రేపు మా జాగీరేనంటూ కౌంటర్
## తెలంగాణ పోరాటాలతో, ఆత్మబలిదానాలతో వచ్చిందన్న వెన్నెల



**తెలంగాణ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై గద్దర్ కూతురు వెన్నెల తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున పవన్ మాట్లాడిన మాటలు తెలంగాణ అస్తిత్వాన్ని, తన తండ్రి వారసత్వాన్ని అవమానించేలా ఉన్నాయని ఆమె మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం సోషల్ మీడియాలో ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "పవనన్న, మిగతా .. 2లో..

### కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా

# డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం



**విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఆయనతో ప్రమాణం చేయించారు. బుధవారం లోక్‌భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ, కేరళ, హిమాచల్ ప్రదేశ్ సీఎంలు రేవంత్ రెడ్డి, వీడీ సతీశన్, సుఖ్విందర్ సింగ్ సుఖు, ఇతర ఏఐసీసీ నేతలు హాజరయ్యారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు మిగతా .. 2లో..

# ఖమేనీని కలవాలనుంది..

## ట్రంప్ వ్యాఖ్యలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీని కలవాలని ఉందని చెప్పారు. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన రోజునే మొజ్తాబా గాయపడ్డారు. తర్వాత ఆయన కోమాలో ఉన్నారని వార్తలు వచ్చాయి. అయితే ఇరాన్ నిర్ణయాలపై ఆయన ప్రభావం చూపుతున్నారని అమెరికా అధ్యక్షుడు అంగీకరించారు. "అక్కడ చాలా కాలంగా ఉన్న పద్ధతి ప్రకారంగానే.. ఆయన ఆమోదం తెలుపుతున్నారని అంటున్నారు. మొదట ఆయన తండ్రి, ఇప్పుడు ఈయన.. ఇదంతా వారసత్వక్రమం అనుకుంటాను" అని ఇరాన్ పాలన శైలి గురించి మాట్లాడారు. అలాగే ఇరాన్ వద్ద ఎట్టిపరిస్థితుల్లో అణ్వాయుధాలు మిగతా .. 2లో..

# విశాఖ-కాకినాడ తీరంలో భారీ కెమికల్ ప్లాంట్

## రష్యా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్ - ప్రముఖ రసాయన సంస్థ రస్ కెమ్ గ్రూప్‌తో కీలక సమావేశం
## పోర్టు ఆధారిత లాజిస్టిక్స్ హబ్ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి
## లోకేష్ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయిలో చర్చిస్తామన్న రస్ కెమ్ ప్రతినిధులు



**విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిచ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న మిగతా .. 2లో..

### జూన్ 5 నుంచి అమల్లోకి

# సవరించిన భూముల మార్కెట్ విలువలు

## తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# గౌరగనమూడిలో 'రెండు మీటర్ల' నరకం..

పథకం ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి కొత్త కష్టాలను తెచ్చిపెట్టిందని వారు ఆరోపిస్తున్నారు. నీటి కోసం గ్రామ ప్రజలు పడుతున్న బాధలు చూస్తే హృదయం కలిచివేస్తాయి. నల్లా ద్వారా నీరు అందకపోవడంతో వేరే మార్గం లేక ఇళ్ల ముందు భూమిలో సుమారు రెండు మీటర్ల లోతులో తవ్విన గుంతల వరకు వెళ్లి అక్కడి నుంచి డబ్బాలు, బిందెలతో నీటిని తోడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఈ గుంతల వద్దే కష్టాలు పడుతున్నారు. భూమి లోపల పూడ్చిన పైపుల వద్ద నిల్వ అయ్యే నీటిని సేకరించేందుకు గుంతల్లోకి వంగి నీరు తీసుకోవడం తప్ప వారికి మరో మార్గం కనిపించడం లేదు. ప్రత్యేకంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఇంటి పనులు, పిల్లల సంరక్షణతో పాటు తాగునీటి కోసం గంటల తరబడి కష్టపడాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. గుంతలు లోతుగా ఉండటంతో నీటిని తీసేందుకు చాలా జాగ్రత్తగా వంగాల్సి వస్తోంది. కాస్త అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు ఆడుకుంటూ గుంతల దగ్గరకు వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు భయపడుతున్నారు. వృద్ధులు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ప్రతిరోజూ ఈ గుంతల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవడం చాలా కష్టంగా మారిందని చెబుతున్నారు. గ్రామస్తుల ఆవేదనలో మరో ముఖ్యమైన అంశం ఆరోగ్య సమస్యలు. ఇళ్ల ముందు తవ్విన గుంతల్లోకి వర్షపు నీరు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే మురికి నీరు చేరుతోందని వారు చెబుతున్నారు. కొన్ని చోట్ల డ్రైనేజీ నీరు కూడా గుంతల్లో కలుస్తోందని ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ తాగడానికి మరో ప్రత్యామ్నాయం లేక అదే నీటిని వడబోసుకుని వినియోగించాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. దీనివల్ల పిల్లలు, వృద్ధులు తరచూ జ్వరాలు, విరేచనాలు, చర్మవ్యాధులు వంటి సమస్యలతో బాధపడుతున్నారని చెబుతున్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన పథకం కారణంగా ఇప్పుడు ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల ప్రకారం సమస్య గురించి ఎన్నిసార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లభించలేదని చెబుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖ సిబ్బంది సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉండగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించలేదని ఆరోపిస్తున్నారు. పైప్‌లైన్లలో ఉన్న లోపాలను సరిచేసి నీటి ఒత్తిడిని పెంచే చర్యలు తీసుకుంటే సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. కానీ ఆ దిశగా ఎలాంటి కదలిక కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో నివసిస్తున్న మహిళలు మాట్లాడుతూ, ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చామని చెబుతున్నప్పటికీ ఒక్క చుక్క నీరు కూడా రావడం లేదన్నారు. ప్రతిరోజూ రెండు మీటర్ల లోతు గుంతల వద్దకు వెళ్లి నీటిని తోడుకోవాల్సి వస్తోందని, ఆ సమయంలో ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. తమ పరిస్థితిని చూసే వారు ఎవరూ లేరని, సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కాలనీలోని మహిళలు మాట్లాడుతూ గుంతల్లోకి వర్షపు నీరు, మురికి నీరు చేరుతున్నప్పటికీ అదే నీటిని వినియోగించాల్సి వస్తోందన్నారు. దీనివల్ల పిల్లలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని, తాగునీటి కోసం ఇంతటి దయనీయ పరిస్థితి ఎదుర్కోవాల్సి రావడం బాధాకరమని పేర్కొన్నారు. గ్రామంలోని వృద్ధులు మాట్లాడుతూ తమ వయసులో ప్రతిరోజూ లోతైన గుంతల్లోకి వంగి నీరు తీసుకోవడం చాలా కష్టంగా మారిందన్నారు. కీళ్ల నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ తాగునీటి కోసం ఆ కష్టాన్ని భరించాల్సి వస్తోందని చెప్పారు. పైప్‌లైన్ల నిర్మాణంలో జరిగిన లోపాల కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని, సమస్యను ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని వాపోయారు. గౌరగనమూడి గ్రామ ప్రజలు ఇప్పుడు జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని కోరుతున్నారు. ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేసిన తర్వాత కూడా ప్రజలు ఇళ్ల ముందు గుంతలు తవ్వుకుని నీరు తెచ్చుకోవాల్సి వస్తే ఆ పథకం అమలు లక్ష్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసిన పనుల నాణ్యతపై సమగ్ర విచారణ జరపాలని, పైప్‌లైన్లలో ఉన్న సాంకేతిక లోపాలను వెంటనే సరిచేయాలని, ప్రతి ఇంటికి నల్లా ద్వారా సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఈ దయనీయ పరిస్థితిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం గౌరగనమూడి గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు పడుతున్న అవస్థలు ప్రభుత్వ పథకాల అమలుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఇంటి ముందే గుంత తవ్వుకుని నీరు తెచ్చుకోవాల్సిన ఈ పరిస్థితి మారే రోజు కోసం గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

### ప్రజాస్వామ్యంలో ఎవరైనా..

# ఎక్కడైనా సభలు నిర్వహించుకోవచ్చు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ఇలాంటి మాటలతో అనవసర సమస్యలు సృష్టించవద్దని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు ఫలించవని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో తన యూనిట్‌ను ఏర్పాటు చేసుకుందని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పుడు ఏపీలో ఎలాంటి అభ్యంతరాలు తెలపలేదన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయి ఇప్పటికే 12 ఏళ్లు దాటిపోయిందని.. ఈ సుదీర్ఘ కాలంలో ఎవరెవరు ఏం చేశారనేది రెండు రాష్ట్రాల ప్రజలకు చాలా స్పష్టంగా తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ఏవైనా సమస్యలు లేదా భేదాభిప్రాయాలు ఉంటే రాజకీయంగా, లాజికల్‌గా ముందుకెళ్లాలి తప్ప.. ఇలాంటి వ్యాఖ్యలతో రాష్ట్రాల్లో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టవద్దని సూచించారు. "తెలంగాణలో పవన్ కళ్యాణ్ గారిపై కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సరైన పద్ధతి కాదు. ఇలాంటి మాటలు మాట్లాడి లేనిపోని సమస్యలు సృష్టించకూడదు. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత ఇప్పుడు అనవసరంగా మాట్లాడి విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారు. కానీ అది సాధ్యం కాదు. ఏ ప్రాంతానికి ఎవరు ఏం చేశారో ప్రజలకు బాగా తెలుసు. నేను ఇటీవలే తమిళనాడులో ఎన్నికల ప్రచారానికి వెళ్లి వచ్చాను. అక్కడకు కర్ణాటకతో పాటు దేశంలోని అన్ని ప్రాంతాల నేతలు వచ్చారు. కర్ణాటక నుంచి డీకే శివకుమార్ కూడా వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉన్నాయి. ఆ బీఆర్ఎస్ జాతీయ పార్టీ అని చెప్పి ఆంధ్రప్రదేశ్‌లో కూడా విస్తరిస్తామని అన్నారు. మరి ఇప్పుడు ఎందుకిలా మాట్లాడుతున్నారో నాకైతే అర్థం కావడం లేదు. ఇది సరైన విధానం కాదు. ఈ రోజు అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి దేశాల్లో ఎంతోమంది తెలుగువారు రాజ్యాంగ పదవుల్లో ఉన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో మనవాళ్లు పదవులు చేపట్టి, అక్కడి రాజ్యాంగం ప్రకారం పనిచేస్తున్నారు. ప్రజలకు ఎవరు మంచి సేవ చేస్తే వారే ఆయా ప్రాంతాల్లో నాయకులు అవుతారు. రాజకీయ నాయకులు అభివృద్ధిలో, ప్రజా సేవలో పోటీ పడాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై దృష్టి పెట్టాలి. అంతేకానీ ఇలాంటి విమర్శలతో ప్రజల మధ్య దూరం పెంచకూడదు" అని చంద్రబాబు హితవు పలికారు.

### తెలంగాణ భూమిపుత్రులే

# పోటీ చేస్తామంటే అభ్యంతరమేంటి?

గట్టిగా అడ్డుకుంటా. తెలంగాణ, గద్దర్ కుటుంబ సభ్యులపై నాకు గౌరవం ఉంది. తెలంగాణ కోసం పనిచేస్తాం. తెలంగాణ భూమిపుత్రుల జాగీరు. దాన్ని ఎవరూ కాదనరు. కానీ, అందులోకి రానివ్వమని చెప్పడంపైనే అభ్యంతరం వ్యక్తం చేశా. గద్దర్ వంటి వారు ఎప్పుడూ ఇలా ఎవరినీ రావొద్దని మాట్లాడలేదు. కేటీఆర్ నాకు సోదరుడితో సమానం. ఆయన ఏం మాట్లాడారో నేను వినలేదు. ఆంధ్రా నాయకులు ఎవరూ వెళ్లి తెలంగాణలో పోటీ చేయట్లేదు. తెలంగాణ భూమి పుత్రులే పోటీ చేస్తామంటే అభ్యంతరమేంటి? ఈ వ్యవహారం చినికి చినికి గాలివానలా మారింది. కుట్ర ఉందని నేను చెప్పలేను. విద్వేషాలకు ముగింపు పలకాలనేదే నా ఆలోచన" అని పవన్ అన్నారు.

**సంఘాలు పెట్టుకుని నాయకులు బాగుపడ్డారు కానీ ఆయా కులాల ప్రజలు నష్టపోయారన్న పవన్**

రాష్ట్రంలో కుల సంఘాలు ఏర్పాటు చేసుకుని వాటి నాయకులు బాగుపడ్డారేమో కానీ, ఆయా కులాల ప్రజలు మాత్రం అభివృద్ధికి నోచుకోకుండా తీవ్రంగా నష్టపోతున్నారని జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కులాల పేరుతో జరుగుతున్న రాజకీయాలకు చరమగీతం పాడాలని, కులాల ఐక్యతే తమ పార్టీ మూల సిద్ధాంతమని స్పష్టం చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం పవన్ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణమైన పొట్టి శ్రీరాములు వంటి మహనీయుడిని సైతం ఒక కులానికే పరిమితం చేసే దుస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుల రాజకీయాలు, కుల దూషణలు పరాకాష్టకు చేరాయని పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. 1998 నుంచి మొదలైన ఈ ధోరణి, వైసీపీ పాలనలో జర్నలిస్టులను సైతం కులం పేరుతో దూషించే స్థాయికి దిగజారిందని విమర్శించారు. ఒక ఎమ్మెల్సీ, దళిత యువకుడిని హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేస్తే, అధికార పార్టీ నేతలు హంతకుడిని వెనకేసుకొచ్చారని, అప్పుడు దళిత సంఘాలు సైతం మాట్లాడలేని పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. అలాగే కరోనా సమయంలో డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి, ఆయన మరణానికి కారణమైనా ఏ సంఘాలు నోరు మెదపలేదని అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కుల సంఘాలు మౌనంగా ఉండిపోవడం వల్లే నాయకులు బాగుపడుతున్నారని, ప్రజలు మాత్రం నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. కుల నిర్మూలన అనే అంబేద్కర్ ఆశయం సాధ్యమో కాదో తెలియదు కానీ, కులాల మధ్య ఐక్యత, పరస్పర సహకారం నేటి సమాజానికి అత్యవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ సమస్యతో బాధపడుతుంటే, వాటిని పక్కనపెట్టి కేవలం కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయాలు చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ కుల రాజకీయాలకు ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని తమ పార్టీ నిర్ణయించుకుందని పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన తరఫున గెలిచిన 54 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు వేర్వేరు కులాలకు చెందినవారేనని, అందరి సహకారంతోనే గెలుపు సాధ్యమైందని గుర్తు చేశారు. ఇకపై ఆంధ్రప్రదేశ్‌లో కులాల ఐక్యతను ప్రోత్సహిస్తూ, అభివృద్ధి ఆధారిత రాజకీయాలకు శ్రీకారం చుడతామని జనసేన నాయకత్వం సమిష్టిగా నిర్ణయం తీసుకున్నట్లు పవన్ ఈ సందర్భంగా ప్రకటించింది.

కేటీఆర్ తనపై తప్పుగా మాట్లాడి ఉండరన్న పవన్ కల్యాణ్

తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనను ఉద్దేశించి ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేసి ఉండరని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. తనకు కేటీఆర్‌తో మంచి సోదరభావ సంబంధం ఉందని, అనేక సందర్భాల్లో ఇద్దరం కలిశామని, తమ మధ్య పరస్పర ఇష్టాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలో మీడియాతో మాట్లాడిన సందర్భంగా, కేటీఆర్ వ్యాఖ్యల గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు పవన్ ఈ విధంగా స్పందించారు. "కేటీఆర్ గారు ఏమన్నారో నేను పూర్తిగా చూడలేదు. కానీ, నాకు తెలిసి ఆయన పొరపాటు మాటలు మాట్లాడరు. బహుశా ఆయన నా పూర్తి వ్యాఖ్యలు చూడలేదేమో. ఆయన ఒక సరైన దృక్పథంతోనే మాట్లాడి ఉంటారని అనుకుంటున్నా. కొన్నిసార్లు విషయాలను చిలికి చిలికి గాలివానలా మారుస్తుంటారు. దీనిపై అంతకుమించి ఏమీ లేదు" అని పవన్ కళ్యాణ్ వివరించారు. విధానపరమైన అంశాల్లో భేదాభిప్రాయాలు ఉండటం సహజమని, అయితే తమ వ్యక్తిగత సంబంధం వేరని ఆయన పేర్కొన్నారు. ఈ వివాదంపై పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదని, తామిద్దరం ఎప్పుడైనా కలిసినప్పుడు దీని గురించి సరదాగా మాట్లాడుకుంటామని పవన్ కల్యాణ్ తేలికగా వ్యాఖ్యానించారు.

# అవును, తెలంగాణ మా జాగీరే

మిమ్మల్ని ఒక నటుడిగా, గద్దరన్న అభిమానిగా తెలంగాణ ప్రజలు గౌరవిస్తారు. కానీ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీరు మాట్లాడిన మాటలను ఒక తెలంగాణ ఆడబిడ్డగా నేను ఖండిస్తున్నాను" అని వెన్నెల స్పష్టం చేశారు. "తెలంగాణ మీ జాగీరా అని అడిగారు. అవును, తెలంగాణ గడ్డ నిన్న మా అయ్యల జాగీరే. ఈరోజు మా జాగీరు. రేపు మా బిడ్డల జాగీరు. ఇది ముమ్మాటికీ మా జాగీరే" అంటూ ఆమె ఘాటుగా బదులిచ్చారు. పైసలు పంచితే, లాబీలు చేస్తే తెలంగాణ రాలేదని, పోరాటాలతో వచ్చిందని అన్నారు. ఎవరినీ బాధపెట్టకుండా, హింసించకుండా, తమకు తాము ప్రాణాలు అర్పించుకుని తెలంగాణ సాధించుకున్నామని అన్నారు. ఇందుకు శ్రీకాంతచారి ఉదాహరణ అని చెప్పారు. పల్లెపల్లెలో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్నామని అన్నారు. తెలంగాణ కోసం ఎంతోమంది ప్రాణాలు అర్పించారని అన్నారు. తెలంగాణలో జనసేన పార్టీని విస్తరించి, జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని జూన్ 2న హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ప్రకటించారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదం కన్నా ప్రమాదకరమని, తెలంగాణ ఎవరి జాగీరు కాదని అన్నారు. గద్దర్‌కు తాను వాహనం కొనిచ్చి సహాయం చేశానని గుర్తుచేసుకుంటూ, ఏపీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తానని కూడా తెలిపారు.

### కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా

# డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం

వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు. జి.పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. కేహెచ్ మునియప్ప, కె.జె.జార్జ్, ఎంబీ పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జర్కిహోళి, కృష్ణబైరి గౌడ, యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌కు మంత్రి పదవులు దక్కాయి.

# ఖమేనీని కలవాలనుంది..

ఉండకూడదని అధ్యక్షుడు పునరుద్ఘాటించారు. అందుకు ఇరాన్ కూడా అంగీకరించిందని చెప్పారు. ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రతిష్టంభన కొనసాగుతోన్న వేళ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉంటే..ఒప్పందం ఖాయమవుతుందనే సమయంలో అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు భగ్గుమన్న సంగతి తెలిసిందే. ఇరాన్‌లోని గెరుక్, ఖేష్మ్ ద్వీపంపై శని, ఆదివారాల్లో అమెరికా చేపట్టిన వైమానిక దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో కువైట్‌లోని విమానాశ్రయంపై ఇరాన్ చేసిన డ్రోన్ దాడుల్లో ఒక భారతీయుడు ప్రాణాలు కోల్పోయారు.

### తప్పుడు ప్రచారాలు చేస్తే..

# క్రిమినల్ కేసులు తప్పవు

నిర్వహించారో ప్రజలందరూ చూశారని గుర్తుచేశారు. డీఎస్సీ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ కేవలం నోటి మాటలతో తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హోంమంత్రి గట్టిగా హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులలో అత్యధిక శాతం మంది గతంలో టీడీపీ హయాంలోనే నియమితులయ్యారని, గతంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించి తాము ఎంతో గౌరవప్రదంగా నియామక పత్రాలను అందించామని స్పష్టం చేశారు. 'బ్రిడ్జ్ స్పోర్ట్స్' అంశంపై అవగాహన లేకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని అనిత ఎద్దేవా చేశారు. బ్రిడ్జ్ స్పోర్ట్స్ అంటే గొడ్డలి పార్టీ నాయకులు గతంలో నడిపించిన జూదం క్లబ్‌లు కావని చురకలు అంటించారు. కేవలం రాజకీయ ఉనికి కోసమే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

# విశాఖ-కాకినాడ తీరంలో భారీ కెమికల్ ప్లాంట్

అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ-కాకినాడ పీసీపీఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి" అని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్తుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పీవీల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ప్లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి నారా లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.

### జూన్ 5 నుంచి అమల్లోకి

# సవరించిన భూముల మార్కెట్ విలువలు

అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. "భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఫ్లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస రేట్లు ఖరారు చేశాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాం"అని మంత్రి తెలిపారు.

# కోటి మందితో యోగాంధ్ర-2026

**జూన్ 21న కోటి మందితో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం**

**జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది భాగస్వామ్యంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగాంధ్ర-2026' పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న జరిగే ఈ కార్యక్రమ నిర్వహణ, లక్ష్యాలపై ఆయన అమరావతిలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా అని, దానిని ప్రజా ఉద్యమంగా మార్చి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' (వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించడం) థీమ్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. "యోగా కేవలం ఒక్కరోజు కార్యక్రమం కాదు, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా మార్చుకోవాలి. ఈ లక్ష్యంతో జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటిస్తున్నాం. జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయి" అని వివరించారు. ప్రధాన కార్యక్రమం అమరావతిలో కృష్ణానది పశ్చిమ బైపాస్ వంతెనపై 25 వేల మందితో నిర్వహిస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మందితో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో పాటు ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి 56 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించి 'యోగా-టూరిజం'ను ప్రోత్సహిస్తామన్నారు. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించామని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను, 2.50 లక్షల మంది ట్రైనర్లను తయారు చేయడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సలహాలు, సేవలు తీసుకుంటున్నామని, ఆయన రూపొందించిన 168కి పైగా వీడియోలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 81424 04888 వాట్సాప్ నంబర్‌కు 'ఎఱ' అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా yogandhra.ap.gov.in పోర్టల్‌ను ప్రారంభించామని, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్, బ్రహ్మకుమారీస్ వంటి సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటున్నట్లు సీఎం వెల్లడించారు. గతేడాది యోగాంధ్ర కార్యక్రమానికి 2.44 కోట్ల మంది నమోదు చేసుకున్న స్ఫూర్తితో ఈసారి కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేసి, యోగాను 365 రోజుల ఉద్యమంగా కొనసాగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## జగన్‌కు బీఆర్ఎస్ పోయి.. కవిత వచ్చే..!

వైసీపీ అధినేత జగన్‌కు ఇరుగు పొరుగు రాష్ట్రాల మద్దతు ఉన్న విషయం తెలిసిందే. సమయం చూసుకు ని స్పందించే నాయకులు ఉన్నారు. అయితే.. ఒక్కొక్కసారి ఆయనను విమర్శించిన పొరుగు రాష్ట్ర నేతలు కూడా కనిపిస్తారు. హరీష్‌రావు, కేటీఆర్‌వంటి తెలంగాణ నాయకులు జగన్‌కు మిత్రులే అయినా.. సమయం సందర్భం చూసుకుని ఆయనను సమర్థించారు. ఒక్కొక్కసారి తీవ్రంగా విమర్శించారు. 4 వేల కోట్ల కోసం.. జగన్.. రైతులను ఫణంగా పెట్టారంటూ.. గతంలో హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి.

అప్పట్లో రైతులు వాడే విద్యుత్‌కు స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయం తీసుకున్నారు జగన్. ఇది కేంద్ర ప్రభు త్వం చెప్పడంతోనే .. చేశారని హరీష్‌రావు చెప్పారు. అంతేకాదు.. ఇలా చేస్తే.. కేంద్రం నుంచి 4 వేల కోట్ల రూపాయల మేరకు జగన్ ప్రభుత్వానికి అప్పుగా వస్తోందన్నారు. ఇది రాజకీయంగా జగన్‌కు ఇబ్బంది సృష్టించింది. ఇక, కేటీఆర్ కూడా.. ఏపీలో వైసీపీ పాలనా సమయంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించి ..ఇరుకున పడేశారు. ఏపీలో ఎక్కడ చూసినాగుంతల రోడ్లే ఉన్నాయని.. తన స్నేహితులు చెప్పారంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు.

అయినప్పటికీ.. జగన్ బీఆర్ఎస్ నాయకులతో కలివిడిగానే ఉంటున్నారన్న చర్చ ఉంది. కట్ చేస్తే.. ఇప్పుడు బీఆర్ఎస్ స్థానంలో కవిత తెరమీదికి వచ్చారు. నేరుగా జగన్‌ను ఆమె సమర్థించకపోయినా.. అసందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు.. వైసీపీలో చర్చకు దారితీశాయి. జగన్ రాజధాని విషయంలో చేసిన -మావిగన్- ప్రకటనను కవిత స్వాగతిస్తున్నట్టుగా మాట్లాడారు. దీనిని అడ్డు పెట్టుకుని కూటమి ప్రభుత్వంపైనా ముఖ్యంగా సీఎం చంద్రబాబుపైన, రాజధాని అమరావతిపైనా విమర్శలు గుప్పించారు.

దీంతో వైసీపీ నాయకులు తమకు బూస్ట్ వచ్చిందని అనుకుంటున్నారు. కానీ, ఇది వాపే తప్ప బలుపు కాదని.. తెలంగాణ నాయకులను విశ్వసించడం సరికాదని చెబుతున్న వారు కూడా ఉన్నారు. ఎప్పుడు ఎలాంటి టర్న్ తీసుకుంటారో తెలియని.. కవిత గారి లాంటి నాయకులను నమ్మితే.. నిండా మునగడం కాయమ ని



అంటున్నారు. కాబట్టి.. కవిత ఏదో చెప్పారని.. చంద్రబాబుపై విమర్శలు గుప్పించారని.. పొంగిపోతే.. అది మొత్తానికే ఇబ్బంది అవుతుందని చెబుతున్న నాయకులు కూడా ఉన్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## రాజమహేంద్రవరంలో రెచ్చిపోయిన చైన్ స్నాచర్లు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు. రాజమహేంద్రవరంలోని పలు ప్రాంతాల్లో బైక్‌లపై వెళ్తూ గొలుసు చోరీలకు పాల్పడ్డారు. ఉదయం దానవాయిపేట పార్క్, లాలా చెరువు సర్వీస్ రోడ్డులో చైన్ స్నాచింగ్‌లు జరిగాయి. రెడ్, బ్లాక్ కలర్ పల్సర్ బైకులపై తిరుగుతూ బంగారు గొలుసులను లాక్కుని పోయారని స్థానికులు పేర్కొన్నారు. కిందపడిపోయిన ఓ వృద్ధురాలిని నిందితులు కొంత దూరం లాక్కొని వెళ్లి మరీ మెడలోని చైన్‌ను తస్కరించారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా మరో మహిళ మెడలో మూడు కాసుల బంగారపు గొలుసుని కొట్టేశారు. ఈ మేరకు బాధితురాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి నిందితులను పట్టుకునేందుకు పోలీసు టీమ్‌లు రంగంలోకి దిగాయి.

## 'డ్రగ్స్' తయారీ కేంద్రం గుట్టురట్టు

**కోహీర్ మండలం పీచేర్యాగడి తండాలో గుర్తించిన మహారాష్ట్ర పోలీసులు**

**రూ.20 కోట్ల మత్తు పదార్థాలు, రసాయనాల స్వాధీనం**



**సంగారెడ్డి, విశ్వం వాయిస్ న్యూస్ :** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పీచేర్యాగడి తండాలో నడుపుతున్న 'డ్రగ్స్' తయారీ కేంద్రం గుట్టును మహారాష్ట్ర పోలీసులు రట్టు చేశారు. రెండెకరాల ఫామ్‌హౌస్‌లో ఉన్న ఈ కేంద్రంపై దాడిచేసి రూ.20.72 కోట్ల విలువైన మత్తుపదార్థాలు, రసాయనాలు, ల్యాబ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ముంబయిలో మొదలైన డ్రగ్స్ దందా దర్యాప్తులో తీగ లాగితే పీచేర్యాగడి తండాలో డొంక కదిలింది. మే 29న దాడులు చేసిన మహారాష్ట్రకు చెందిన మీరా-భయందర్, వసాయి-విరార్ (ఎంబీవీవీ) పోలీసులు ఠాణేలోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం డ్రగ్స్ ముఠా వివరాలను వెల్లడించారు. ఏప్రిల్ 4న మహారాష్ట్రలోని ఠాణే జిల్లా మీరారోడ్ (తూర్పు) నయానగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో పోలీసులు సోదాలు చేసి 1.324 కిలోల 'ఎండీ' డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఫిర్దోస్ అర్బాజ్ ఖురేషి, ఆమె భర్త అర్బాజ్ వకీల్ ఖురేషీలపై కేసు నమోదు చేశారు. ముంబయి నుంచి హైదరాబాద్ వరకు డ్రగ్స్ నెట్‌వర్క్ విస్తరించినట్లు గుర్తించి లోతైన దర్యాప్తు చేపట్టారు. ముంబయిలోని పలు ప్రాంతాల్లో దాడులుచేసి తొలుత 15 మందిని అరెస్టు చేశారు. వీరి విచారణలోనే అంతర్రాష్ట్ర డ్రగ్స్ నెట్‌వర్క్ గుట్టు బయటపడింది. అనంతరం ఛత్తీస్‌గఢ్‌లోని ఖలాపుర్‌లో వీరస్వామి నాయుడు, మరో ఇద్దరు నిందితులు నాసిర్ ఎలియాస్ బాబా జానిమియా షేక్, మొహమూద్ మెహబూబ్ ఖాన్‌లను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. నాసిర్‌ను విచారించగా.. జహీరాబాద్ డివిజన్‌లోని కోహీర్ మండలం పీచేర్యాగడి తండాలోని 'డ్రగ్స్' తయారీ కేంద్రానికి సంబంధించిన కీలక విషయాలు బయటపడ్డాయి. ఈ మేరకు మే 29న దాడులు నిర్వహించి దాన్ని సీజ్ చేశారు. రూ.6.22 కోట్ల విలువైన ల్యాబ్ పరికరాలతోపాటు మొత్తం పట్టుబడిన మత్తు పదార్థాలు, రసాయనాల విలువ రూ.20.72 కోట్లుగా నిర్ధారించారు.

## 3 వేల సీశామ్ వీడియోల గుర్తింపు

**ఝార్ఖండ్ ముఠా ఆట కట్టించిన టీజీసీఎస్‌బీ**

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) ఝార్ఖండ్‌కు చెందిన చైల్డ్ పోర్నోగ్రఫీ(బాలల అశ్లీల దృశ్యాలు) ముఠా గుట్టు రట్టు చేసింది. వీక్షణంతోపాటు పంపిణీలో ఉన్న సుమారు 3వేల చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలను గుర్తించి ఝార్ఖండ్ పోలీసులకు సమాచారం అందించింది. దీంతో అక్కడి సీఐడీ సైబర్‌క్రైమ్ పోలీసులు గిరిధ్ జిల్లా కొల్ధికి చెందిన వాహన్ అన్సారీ, హసన్‌రజాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొన్నారు. నిందితుల ముఠా టెలిగ్రామ్ ఛానెల్‌లో వీటిని షేర్ చేయడంతోపాటు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. చైల్డ్ సెక్సువల్ అబ్యూసివ్ మెటీరియల్(సీశామ్)కు సంబంధించిన పలు ఆన్‌లైన్ గ్రూపులు, ఛానెళ్లలో నిందితులు సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ), ఒమన్, బంగ్లాదేశ్.. తదితర మిడిల్ ఈస్ట్ దేశాల్లోని వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. సీశామ్ వీక్షణం, విక్రయాలపై సైబర్‌గస్తీ ద్వారా నిరంతరం పోరు సాగిస్తున్న టీజీసీఎస్‌బీ.. కొద్దిరోజులుగా కృత్రిమమేధ ఆధారిత రెడ్‌పాండా ప్లాట్‌ఫాం ద్వారా ఈ నిఘాను మరింత విస్తృతం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రాలు, వీడియోలను రెడ్‌పాండా పసిగట్టింది. అనంతరం ఆయా వీడియోలు, చిత్రాల డిజిటల్ ఫుట్‌ప్రింట్‌లను గుర్తించడం ద్వారా తాజాగా ఝార్ఖండ్ పోలీసుల్ని అప్రమత్తం చేయడంతో ముఠా ఆట కట్టించగలిగింది.

## క్రిప్టో కరెన్సీ పేరిట రూ.10 కోట్లు వసూలు

**విశాఖలో ఘరానా మోసం.. ఒకరి అరెస్టు**



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రిప్టో కరెన్సీ ద్వారా పెట్టుబడి పెడితే అధిక వడ్డీ, లాభాలొస్తాయని నమ్మించి పలువురిని మోసం చేసిన వ్యక్తిని మంగళవారం విశాఖలోని కంచరపాలెం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇక్కడి బిర్లా జంక్షన్ వద్ద బొత్స స్క్వేర్ అపార్ట్‌మెంట్‌ను కేంద్రంగా మహ్మద్ అజీమ్‌ఖాన్ అనే వ్యక్తి పంక్ పాండా, ఐటీసీ గ్లోబల్, కేగుష్ పేరిట క్రిప్టోకరెన్సీ వెబ్‌సైట్లు ప్రారంభించాడు. పెట్టుబడి ప్లాట్ఫాంలను ప్రోత్సహిస్తున్నానని, వాటిలో చేరి పెట్టుబడి పెడితే తక్కువ కాలంలోనే ఎక్కువ డబ్బులొస్తాయని, లాభాలు గ్యారంటీ అని నమ్మించాడు. జూమ్ మీటింగ్ ద్వారా పరిచయం చేసుకుని అమాయకులను బుట్టలో వేసుకున్నాడు. ఆ మాటలకు ఆకర్షితుడై ఎన్ఏడీ కూడలి ప్రాంతానికి చెందిన పి.రత్నరాజు 2021 నుంచి 2025 వరకు రూ.36 లక్షల పెట్టుబడి పెట్టారు. తెలుగు రాష్ట్రాల్లో ఆయన మిత్రులు, సహచరులను నిందితుడికి పరిచయం చేసి వారూ పెట్టేలా ఒప్పించారు. నిందితుడు ఇలా సుమారు 50 మంది నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేశాడు. కొంతకాలంగా పెట్టుబడిదారులతో మాట్లాడటం మానేసి సంబంధిత వెబ్‌సైట్లు, అప్లికేషన్లను మూసేశాడు. పెట్టుబడి మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని రత్నరాజు డిమాండ్ చేయడంతో.. తనకు సీనియర్ పోలీసు అధికారులు, ప్రభుత్వంలో ఉన్నతస్థాయి వ్యక్తులతో సంబంధాలున్నాయంటూ అజీమ్‌ఖాన్ బెదిరించాడు. హనీట్రాప్ కేసులో ఇరికిస్తానని, అలా చేయకుండా ఉండాలంటే రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బాధితుడు భయపడి రూ.10 లక్షలు ఇచ్చారు. అజీమ్‌ఖాన్ ఆ తర్వాతా ఇదే పంథా అనుసరిస్తుండటంతో కంచరపాలెం పోలీసులకు ఆధారాలతో రత్నరాజు ఫిర్యాదు చేశారు. సీఐ కె.రవికుమార్ నిందితుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భారీగా పశువుల అక్రమ రవాణా

**10 కంటెయినర్లలో 438 తరలింపు**



**పెద్దమండ్యం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నమయ్య జిల్లా మీదుగా భారీగా తరలిపోతున్న పశు వుల కంటెయినర్లను హిందూ సంఘాల సభ్యులు, స్థానికులు అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురం, కదిరి, పత్తికొండ పరిసర ప్రాంతాల్లో కొనుగోలు చేసిన 438 పశువులను కొందరు పది కంటెయినర్లలో జిల్లా మీదుగా కేరళకు తరలిస్తున్నారు. వాహనాలు పెద్దమండ్యం చేరుకునేసరికి హిందూసంఘాల సభ్యులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వాటిని అడ్డుకున్నారు. వారి సమాచారం మేరకు.. సీఐ దస్తగిరి, ఎస్సైలు హరిహరప్రసాద్, అనిల్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వాహనాలు, పశువులను చిన్నమండ్యంలోని గోశాలకు తరలించారు. ఒక వాహనంలో రెండు ఎద్దులు మృతిచెందినట్లు గుర్తించారు. గోశాల వద్ద సిబ్బందిని కాపలా ఉంచామని, పూర్తి వివరాలు సేకరిస్తున్నామని సీఐ చెప్పారు.

## వేదాంత గ్రూప్ కార్యాలయంలో ఈడీ సోదాలు

**చెన్నై (ప్యారిస్), విశ్వం వాయిస్ న్యూస్ :** వేదాంత గ్రూప్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోదాలు చేశారు. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం నిబంధనలను ఆ సంస్థ ఉల్లంఘించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు చెన్నై నుంగంబాక్కంలోని కార్యాలయంలో మంగళవారం ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. పలు పత్రాలను వారు స్వాధీనం చేసుకున్నారు.

# గృహ హింసను దాటి.. వైన్ మేకర్‌గా ఎదిగి..

### సక్సెస్ వాయిస్



తాను పుట్టింది ఆడపిల్లలపై అడుగడుగునా ఆంక్షలున్న కుటుంబంలో.. అది చేయకూడదు, ఇది చేయకూడదు.. వాళ్లతో మాట్లాడకూడదు.. అంటూ హద్దులు పెట్టేవారు. ఇక పెళ్లయ్యాక ఈ కట్టుబాట్లకు గృహ హింస కూడా తోడైంది. ఇలాంటి స్థితిలో ఎవరున్నా 'ఇక నా జీవితం ఇంతే!' అనుకునే వారేమో.. కానీ నమ్రత అలా అనుకోలేదు. ఆ నరకం నుంచి బయటపడి కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకుంది. ఈ ఆలోచనతోనే దేశం కాని దేశంలో అడుగుపెట్టింది. ఈ తెగువే ఇప్పుడామెను పెద్ద వ్యాపారవేత్తను చేసింది. ప్రస్తుతం ప్రపంచ గుర్తింపు పొందిన వైన్ మేకర్‌గా పేరు తెచ్చుకున్న నమ్రత జీవిత కథలో సినిమా స్టోరీని తలపించే మలుపులెన్నో!

**ఆంక్షల మధ్య నలిగిపోయా!**

**నమ్రత పుట్టి పెరిగిందంతా బెంగళూరులో. సంప్రదాయాలు, కుటుంబ విలువలకు అధిక ప్రాధాన్యమిచ్చే ఆమె కుటుంబంలో పురుషాధిపత్యం కూడా ఎక్కువగానే ఉండేదట!**

'మా ఇంట్లో ఏ నిర్ణయమైనా మా నాన్నే తీసుకునే వారు. కనీసం అమ్మ సలహా కూడా అడిగేవారు కాదు. ఆడవాళ్లంటే వంటింటికే పరిమితం అన్నది ఆయన భావన. అంతేకాదు.. ఆడపిల్లలు అది చేయకూడదు, ఇది చేయకూడదు.. అబ్బాయిలతో మాట్లాడకూడదు.. ఒంటరిగా బయటికి వెళ్లకూడదు.. అన్న ఆంక్షలు కూడా మా ఇంట్లో ఉండేవి. ఇలాంటి పరిస్థితుల మధ్య పెరిగిన నాకు ఈ సంకెళ్లు తెంచుకొని స్వేచ్ఛా జీవితం గడపాలనిపించేది. కానీ అంత సాహసం చేయలేకపోయా. హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తిచేశాక నాకు పెళ్లైంది. కనీసం అత్తింట్లోనైనా నేను కోరుకున్న స్వేచ్ఛ దొరుకుతుందేమో అనుకున్నా. అయితే అక్కడ పరిస్థితులు మరింత దారుణం. చీరే కట్టుకోవాలనే వారు.. స్నేహితులను కలవడం, సొంతంగా ఉద్యోగం, వ్యాపారం.. వంటివి చేస్తాననడం.. ఏదో పెద్ద పొరపాటుగా భావించేవారు. వీటికి తోడు భర్త వేధింపులు, గృహ హింసనూ ఎదుర్కొన్నా.. ఈ ప్రతికూల పరిస్థితుల నడుమే నాకు పాప పుట్టింది..' అంటూ ఆనాటి రోజుల్ని గుర్తు చేసుకుంది నమ్రత.

**ఫ్రాన్స్‌లో ఉద్యోగమొచ్చింది!**


**ఎప్పటికైనా ఈ ఆంక్షల సంకెళ్లు తెంచుకొని స్వేచ్ఛా జీవితం గడపాలనుకున్న నమ్రత.. ఈ ఆలోచనతోనే తనకు ఆసక్తి ఉన్న ఫ్రెంచ్ భాష నేర్చుకుంది.**

'నా భర్తకు, అత్తింట్లో వాళ్లకు తెలియకుండా రహస్యంగా ఫ్రెంచ్ భాష నేర్చుకున్నా. నేనున్న గడ్డు పరిస్థితుల్లో ఈ భాషా పరిజ్ఞానమే నాకు అండగా నిలిచింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదే నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ పాజిటివిటీతోనే ఓ ప్రముఖ సంస్థలో ఉద్యోగానికి ప్రయత్నించి సక్సెసయ్యా. అయితే ఉద్యోగం వచ్చింది ఫ్రాన్స్‌లో! దీంతో ఒక్కసారిగా నేను ఎదురుచూస్తున్న స్వేచ్ఛ ఈ రూపంలో వచ్చిందేమో అనిపించింది. అంతే.. అత్తింటి నుంచి బయటికొచ్చేసి, పాపను అమ్మానాన్నల దగ్గర వదిలిపెట్టి.. ట్రైనింగ్ కోసం ప్యారిస్ వెళ్లా. అక్కడున్న నెల రోజులు నాకు నచ్చింది తిన్నా.. నచ్చినట్లుగా ఉన్నా. ఆ తర్వాత తిరిగొచ్చిన నేను ఈసారి నా పాపతో పాటు మా అమ్మను కూడా తోడుగా తీసుకెళ్లా..' అంటోన్న నమ్రత.. వైన్ వ్యాపారంలో స్థిరపడాలన్న ఆలోచనతో ఓవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు 'వైన్ అండ్ స్పిరిట్స్' విభాగంలో ఎంబీఏ పూర్తిచేసింది. ఆపై ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి వ్యాపారంలోకి అడుగుపెట్టింది.

**వైన్ క్వీన్‌గా ఎదిగి..!**

**ఈ క్రమంలోనే 2020లో 'వైన్ ఈక్వేషన్' పేరుతో ఓ సంస్థను ప్రారంభించింది నమ్రత. తొలుత మార్కెట్ నుంచి వైన్‌ను కొనుగోలు చేసి విక్రయించే సేవల్ని కొనసాగించిన ఆమె.. ఆపై కొన్నాళ్లకు 'హాశీశ్రీఅఘ్ఖత్‌బం' పేరుతో సొంతంగా వివిధ రకాల వైన్లు తయారుచేసి విక్రయించడం ప్రారంభించింది.**

'ప్రస్తుతం మా బ్రాండ్ పేరుతో వివిధ రకాల పండ్లతో రెడ్, వైట్.. వైన్లు తయారు చేస్తున్నాం. స్టీల్ ట్యాంకుల్లో వారాల తరబడి పులియబెట్టి ప్రత్యేక పద్ధతుల్లో, నాణ్యతా ప్రమాణాల విషయాల్లో ఏమాత్రం రాజీ పడకుండా వీటిని తయారుచేస్తున్నాం'. అంటోందీ వైన్ క్వీన్. ప్రస్తుతం ఫ్రాన్స్ వ్యాప్తంగానే కాదు.. తన వైన్ వ్యాపారాన్ని భారత్, కెనడా, బెల్జియం, మాల్దీవులకూ విస్తరించింది నమ్రత. ఇలా ఓవైపు తన వ్యాపార ప్రయాణాన్ని కొనసాగిస్తూనే.. మరోవైపు వైన్ కన్సల్టెంట్‌గానూ వ్యవహరిస్తోంది. ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లు, సంక్లిష్టతల్ని అధిగమించేలా ఆయా సంస్థలకు తన విలువైన సలహాలు అందిస్తోంది. అంతేకాదు.. తన వ్యక్తిగత, వ్యాపార జీవితాల్లో ఎదురైన సవాళ్లు, అనుభవాల్ని రంగరించి 'వైన్‌యార్డ్ మెలోడీ' పేరుతో ఓ పుస్తకం రాసింది నమ్రత. ఇటీవలే విడుదలైన ఈ పుస్తకం అమెజాన్ బెస్ట్ సెల్లర్స్‌లో ఒకటిగా నిలిచింది. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో తన కూతురితో కలిసి జీవిస్తోందీ వైన్ క్వీన్. తనలా ఆంక్షల చట్రంలో మగ్గిపోకుండా తన కూతురికి స్వేచ్ఛాయుత జీవితాన్నివ్వడంతో పాటు.. తాను కోరుకున్న రంగంలో ప్రోత్సహించడమే తన లక్ష్యమంటోంది నమ్రత.



# అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనితీరు

## ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు - 11వ వార్డులో డ్రైన్లు నిర్మాణానికి శంకుస్థాపన

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణం 11వ వార్డులో డ్రైన్లు నిర్మాణానికి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు బుధవారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ సి ఎస్ పి నిధులు రూ.60.00 లక్షలతో 13 డ్రైన్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపరచడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం



ఉందని పేర్కొన్నారు. డ్రైన్ లు పాడవటంతో వర్షాకాల సమయంలో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ పనులను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతీ వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆ వార్డు టీడీపీ ఇన్ ఛార్జ్ కొవ్వాడ బేబి అప్పన్న బాబు ఎమ్మెల్యే వేగుళ్ళను దుశ్శాలువాతో సత్కరించి, మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు మత్స నాగు, మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, సొసైటి అధ్యక్షులు కుక్కల రామారావు, బీజేపి నాయకులు కోన సత్యనారాయణ, గొడవర్తి రామచంద్రరావు, కాశిన కాశీ విశ్వనాధం, ఆళ్ళ వీరబాబు, కొల్లాటి ప్రసాద్, దాసరి సుదర్శనరావు, పిట్టా అర్జున్, నూకతట్టు కిషోర్, పిట్టా రామన్న, గెద్దం వీర్రాజు, సవరపు సతీష్, మోరంపూడి సుబ్రహ్మణ్యం, బళ్ళ సత్యనారాయణ, పెనుగొండ ధర్మయ్య, సిద్ధిరెడ్డి రామన్న, గనిశెట్టి బాబి, మేడింటి సూర్యప్రకాష్, సిరంగి ఈశ్వరరావు, పాలచర్ల శిరీష్, మున్సిపల్ కమీషనర్ టి.వి.రంగారావు, డిఇ శ్రీనివాస్, ఎ.ఇ లు దాసరి పవన్, అనూష లక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చెయ్యాలి

## ఎన్‌టిఏను రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ డిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ పరీక్షలు నిర్వహించడంలో విఫలమైన ఎన్.టి.ఎ ను రద్దు చేయాలని, వీటికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని బుధవారం ఉదయం స్థానిక బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్.ఎఫ్.ఐ తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు వై. భాస్కర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో 89 పరీక్ష పత్రాలు లీక్ అయ్యాయి అని 48 పరీక్షలు తిరిగి నిర్వహించడం జరిగింది అని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షలు నిర్వహించడంలో ఎన్.టి.ఏ అత్యంత దారుణంగా విఫలమైందని అన్నారు. అయినా సరే కేంద్ర ప్రభుత్వం కానీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి గాని పట్టించుకోని పరిస్థితి కనబడుతుందని అన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్ష పేపర్ లీక్ అవటంతో నీట్ పరీక్ష రద్దు చేశారు. ప్రభుత్వానికి విద్యార్థులు పడే ఇబ్బందులు కనబడట్లేదా అని ప్రశ్నించారు. పరీక్ష నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించి, రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజ్ పై విచారణ జరిపి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ సభ్యులు కె. జ్యోతి, సౌమ్య, కార్తీక్, హేమంత్, సాహితి ఎస్.ఎఫ్.ఐ నాయకులు తనుశ్రీ, చరణ్, బాల, రిషి, శంఖర్, హేమంత్, అన్వేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను గొర్రెల సురేష్ పరిశీలన

## ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నిన్న రాత్రి అకాలంగా వచ్చిన పెనుగాలి, భారీ వర్షాల కారణంగా రాజమహేంద్రవరం 12వ వార్డులో పలుచోట్ల చెట్లు నేలకొరిగి, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో మాజీ కార్పొరేటర్ గొర్రెల సురేష్ సంబంధిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. చిన్న సోమాలమ్మ గుడి సెంటర్, కృష్ణకంటి ఆసుపత్రి సమీపం, పోస్టల్ కాలనీ, స్వామి ఆసుపత్రి పరిసరాలు, శ్యామలాంబ పార్క్ పక్కన ఉన్న రహదారులతో పాటు ఇతర ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత శాఖల సిబ్బందితో మాట్లాడారు. ప్రమాదకరంగా ఉన్న చెట్ల తొలగింపు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారులపై పడిన అవరోధాల తొలగింపు వంటి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గొర్రెల సురేష్ మాట్లాడుతూ అకాల వర్షాలు మరియు పెనుగాలుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవడం అవసరమని అన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వార్డులో ఎక్కడైనా సమస్యలు ఉన్నా ప్రజలు వెంటనే తెలియజేయాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వార్డు నాయకులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీ దిశా నిర్దేశాన్ని బూత్ స్థాయిలో

# సమన్వయంతో పనిచేయాలి

## మూడవ వార్డులో బూత్ ఇన్‌చార్జులు, బూత్ యూనిట్ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో కుడుపూడి సత్తిబాబు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నగరంలోని మూడవ వార్డు బిలాల్ షాదీఖానాలో బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ యూనిట్ ఇన్‌చార్జ్‌లతో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నిర్దేశించిన వారంవారం కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి కార్యకలాపాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి బూత్ స్థాయి కార్యకర్తలే వెన్నెముక అని అన్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయడంలో బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ యూనిట్ ఇన్‌చార్జ్‌ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పార్టీ అధిష్టానం నిర్దేశించిన కార్యాచరణను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంతో పాటు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించి, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని సూచించారు. రాబోయే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు.

### అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి

# ఎమ్మెల్యే ఆదిరెడ్డి ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 49వ డివిజన్ సింహాచలం నగర్‌లో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదానికి గురై నష్టపోయిన కుటుంబాన్ని పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అందుబాటులో ఉన్న సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడి అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. డివిజన్ ఇంఛార్జి దుత్తరపు గంగాధర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

### మునికూడలిలో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులను

# పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో రాజానగరం నియోజకవర్గ శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతను, పురోగతిని పర్యవేక్షించిన ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ సంబంధిత అధికారులకు మరియు కాంట్రాక్టర్‌కు పలు కీలక సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు సకాలంలో అందేలా చూడటమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులను ఎలాంటి అలసత్వం లేకుండా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పౌష్టికాహార కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్షయవ్యాధి నిర్మూలనలో మందులతో పాటు పౌష్టికాహారం కూడా కీలక పాత్ర పోషిస్తుందని, క్షయవ్యాధి బాధితుల ఆరోగ్య పునరుద్ధరణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం సామ్రాజ్య సిల్వర్స్ సహకారంతో నిక్షయ్ మిత్రగా ముందుకు వచ్చి 10 మంది క్షయవ్యాధి బాధితులను దత్తత తీసుకుని పౌష్టికాహార కిట్లను అందించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. తిలక్ రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని బాధితులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ క్షయవ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అయినప్పటికీ, రోగులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా చికిత్స పొందడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని, సమాజంలోని స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు, దాతలు నిక్షయ్ మిత్రలుగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. క్షయవ్యాధిగ్రస్తులకు చికిత్సతో పాటు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా వారి ఆరోగ్య పునరుద్ధరణ వేగవంతం అవుతుందన్నారు. దేశాన్ని క్షయవ్యాధి రహిత భారతంగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమాలు

## నిరసనల్లో వేలాదిగా పాల్గొనాలి : ఎమ్మెల్సీ తోట పిలుపు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** వెన్నుపోటు ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలనీ రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. నిరసనల్లో వేలాదిగా ప్రజలు పాల్గొనాలనీ పిలుపు ఇచ్చారు. మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ధర్నా, నిరసన ల్లో ప్రజా వ్యతిరేకత ప్రతిబింబించాలన్నారు. మండపేటలో వైయస్సార్ పార్టీ ఆధ్వర్యంలో వెన్నుపోటుకు రెండేళ్ళు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వ రెండేళ్ల పాలనలో జరిగిన మోసాలకు నిరసనగా వై.ఎస్.ఆర్.సి.పి మండపేట నియోజకవర్గ శ్రేణులు భారీ కార్యక్రమాలకు సిద్ధమయ్యాయి. రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో జూన్ 4 నుంచి జూన్ 12 వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జూన్ 4 గురువారం కపిలేశ్వరపురం మండలం అంగర పార్టీ ఆఫీసు వద్ద మధ్యాహ్నం 2:30 గంటలకు, రాయవరం మండలం డాక్టర్ వైయస్ఆర్ విగ్రహం వద్ద సాయంత్రం 4:00 గంటలకు టీడీపీ మ్యానిఫెస్టో, సూపర్ సిక్స్ మోసాలపై చర్చ, నిరసన చేపట్టనున్నారు. జూన్ 5 శుక్రవారం ఉదయం 10 గంటలకు మండపేట రూరల్ , పట్టణ పరిధిలోని కరాచీ సెంటర్ జాతీయ నాయకుల విగ్రహాల సెంటర్ వద్ద భారీ నిరసన కార్యక్రమం జరుగుతుంది. జూన్ 8, సోమవారం: ఉదయం 10 గంటలకు సూర్య కన్వెన్షన్ హాల్, మండపేటలో ప్రభుత్వ వైఫల్యాలు – యువత, మహిళలు, రైతుల మోసం' అంశంపై మేగా మీటింగ్ నిర్వహించనున్నారు. నల్ల బెలూన్లు ఎగురవేయడం, ఫోటో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణలుగా నిలవనున్నాయి. జూన్ 12 శుక్రవారం మండపేట నియోజకవర్గ స్థాయిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రజలను మోసం చేసిన టీడీపీ ప్రభుత్వానికి రెండేళ్ల వెన్నుపోటుకు తగిన బదులు ఇవ్వడానికి పార్టీ శ్రేణులందరూ ఒక్కటై ఈ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ సీనియర్లు, నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

# జనసేనానిపై విమర్శలు.. సీన్‌లోకి చంద్రబాబు - తెలంగాణ లీడర్లకు గట్టి కౌంటర్


ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై తెలంగాణ నేతలు చేస్తున్న విమర్శలపై ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. ప్రజాసేవ, అభివృద్ధిలో పోటీ పడాలే తప్ప, ప్రాంతాల పేరుతో లేనిపోని విద్వేషాలు రెచ్చగొట్టడం సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. తెలంగాణ నేతల విమర్శలను తిప్పికొడుతూ బలమైన కౌంటర్ ఇచ్చారు. రెండు రోజులుగా డిప్యూటీ సీఎం టార్గెట్ గా తెలంగాణ రాజకీయ పక్షాలు ఘాటు విమర్శలతో విరుచుకుపడుతున్నాయి. ఏపీకి చెందిన పవన్ కు తెలంగాణలో ఏం పని అంటూ ప్రశ్నిస్తున్నాయి. దీనిపై స్పందించిన చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కు భరోసాగా నిలిచారు. గత రెండు రోజులుగా పవన్ వర్సెస్ తెలంగాణ నేతల మధ్యే డైలాగ్ వార్ కొనసాగుతుండగా, తాజాగా చంద్రబాబు ఎంట్రీ ఇచ్చారు. దీంతో తెలంగాణ పాలిటిక్స్ మరింత రసవత్తరంగా మారేలా కనిపిస్తున్నాయని అంటున్నారు.

**విభజన జరిగి 12 ఏళ్లు.. ఇప్పుడు విద్వేషాలా?**


ఉప ముఖ్యమంత్రి పవన్ పై తెలంగాణ నేతలు చేస్తున్న విమర్శలను ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుపట్టారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచిపోయాయని, ప్రస్తుతం రెండు రాష్ట్రాలుగా విడిపోయి ఎవరి పనుల్లో వారు ఉన్నామని చంద్రబాబు గుర్తుచేశారు. తెలంగాణలోని కొందరు నాయకులు ఇప్పుడు పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం సరికాదన్నారు. ఇలాంటి అనవసర అంశాలను లేవనెత్తి సమాజంలో లేనిపోని సమస్యలను, విద్వేషాలను సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. ఏ ప్రాంతానికి ఎవరు ఎలాంటి సేవలు చేశారో ప్రజలకు పూర్తిగా తెలుసని, నాయకులు అనవసర విషయాలపై సమయం వృథా చేయకూడదని అన్నారు. "నేను తమిళనాడులో ఎన్నికల ప్రచారం చేసి వచ్చాను. అక్కడికి కర్నాటక నుండి డీకే శివకుమార్‌తోపాటు దేశంలోని అన్ని ప్రాంతాల నేతలు, ఆలిండియా లీడర్స్ వచ్చారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎక్కడైనా ప్రచారం చేయవచ్చు, సేవ చేయవచ్చు. రాజకీయాల్లో ప్రాంతీయ పట్టింపులు ప్రగతికి అవరోధం." అంటూ సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్ పార్టీ కూడా ఉందన్నారు. బీఆర్ఎస్ తమది జాతీయ పార్టీ అని ప్రకటించుకుని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా తమ శాఖను ఏర్పాటు చేసి, పార్టీని విస్తరిస్తామని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ పార్టీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లవచ్చు కానీ, ఇతర నేతలు మాట్లాడితే తప్పా అని ప్రశ్నించారు. "అప్పుడు విస్తరిస్తామన్న నాయకులు, ఇప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో నాకైతే అర్థం కావడం లేదు. ఇది ఎంతమాత్రం కరెక్ట్ కాదు" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి ఖ్యాతి**

తెలుగువారి ప్రతిభ కేవలం రెండు రాష్ట్రాలకే పరిమితం కాలేదని, అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి ప్రపంచ దేశాలలో తెలుగువారు ఉన్నతమైన రాజ్యాంగ పదవులను అనుభవిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. అక్కడి రాజ్యాంగాల ప్రకారం వారు ఎంతో అద్భుతంగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఎవరు మంచిగా సేవలందిస్తారో.. వాళ్లే ఆయా ప్రాంతాల్లో నాయకులుగా ఎదుగుతారని ఆయన వివరించారు. నాయకులకు



ఉండాల్సింది ప్రాంతీయ అహంకారం కాదు, సేవా గుణమని చంద్రబాబు పేర్కొన్నారు. నాయకులందరూ అభివృద్ధిలో, ప్రజా సేవలో పోటీ పడాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు ఎలా అందించాలనే దానిపైనే దృష్టి పెట్టాలని, అంతేకాని విమర్శలతో విద్వేషాలు రగల్చడం తగదని తెలంగాణ నేతలకు ఏపీ ముఖ్యమంత్రి గట్టి సందేశాన్ని ఇచ్చారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

గురువారం, 04 జూన్ 2026
www.viswamvoice.com





### తప్పుల్లేని ఓటర్ల జాబితా లక్ష్యంగా

# ప్రత్యేక సమగ్ర సవరణ

**వలస, డూప్లికేట్ ఓట్లపై ప్రత్యేక దృష్టి : జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం ఆశయాలకు అనుగుణంగా వంద శాతం పారదర్శకమైన, తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు, బీఎల్ఓలు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని, వలస ఓటర్ల గుర్తింపు, మ్యాపింగ్‌పై ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తొలి దశ మ్యాపింగ్ అంశంపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా ఎలాంటి డూప్లికేట్, వలస ఓట్ల గందరగోళం లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల మ్యాపింగ్, డేటా సరిపోల్చడంపై బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో తొలి దశ అత్యంత కీలకమని పేర్కొన్నారు కలెక్టర్,



2002 నాటి డేటాతో ప్రస్తుత డేటాను సరిపోల్చే "టేబుల్ ఎక్సర్‌సైజ్"ను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ఎలాంటి తప్పులు లేకుండా, పారదర్శకంగా పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహించాల్సిన తొలి దశ ఓటర్ల మ్యాపింగ్, డేటా సరిపోల్చడం, టేబుల్ ఎక్సర్‌సైజ్ విధానాలపై బీఎల్ఓలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఓటరును సంబంధిత పోలింగ్ కేంద్ర పరిధిలో ఖచ్చితంగా మ్యాప్ చేయాలని స్పష్టం చేశారు. గతంలో ఉన్న 2002 నాటి ప్రాథమిక డేటాను ప్రస్తుతం అందుబాటులో ఉన్న తాజా డేటాతో క్షుణ్ణంగా సరిపోల్చాలని ఆదేశించారు.క్షేత్రస్థాయి పరిశీలనకు ముందు కార్యాలయంలో నిర్వహించే టేబుల్ ఎక్సర్‌సైజ్‌ను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. వలస ఓటర్ల గుర్తింపులో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొంటూ, ఉపాధి, వ్యాపారం లేదా ఇతర కారణాలతో తాత్కాలికంగా వలస వెళ్లిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, ఇతర నియోజకవర్గాల్లో నివసిస్తున్న వారిని క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి గుర్తించాలని ఆదేశించారు. బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి, అక్కడ నివసించే వారి వివరాలను సేకరించాలని చెప్పారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించే ముందు చట్టప్రకారం తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. ఒకే ఓటరుకు రెండు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓటు హక్కు ఉన్నట్లయితే, ప్రస్తుతం వారు నివసిస్తున్న ప్రాంతాన్ని ఆధారంగా తీసుకుని మ్యాపింగ్ పూర్తి చేసి, ఒకే చోట ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం ప్రకటించిన ప్రత్యేక సమగ్ర సవరణ షెడ్యూల్ ప్రకారం నిర్దేశిత గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లను భాగస్వామ్యం చేయాలని, క్షేత్రస్థాయి మార్పులపై వారికి సమాచారం అందిస్తూ పారదర్శకతను కాపాడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.సుబ్బారావు, ఎన్నికల ఉప తహసీల్దార్ శివరాజు తదితరులు పాల్గొన్నారు.

### మెల్‌బోర్న్ మహానాడు-2026లో

# పాల్గొన్న ఎంపీ గంటి హరీష్ బాలయోగి

**ప్రవాస తెలుగు ప్రజలతో ఆత్మీయ భేటీ - పార్టీ సిద్ధాంతాల ప్రచారంలో ప్రవాసాంధ్రుల పాత్ర ప్రశంసనీయం**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో ఘనంగా నిర్వహిస్తున్న మెల్‌బోర్న్ మహానాడు-2026 వేడుకల్లో అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. ఐదు రోజుల ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా మెల్‌బోర్న్ చేరుకున్న ఆయన, పర్యటన మొదటి రోజున మహానాడు కార్యక్రమానికి హాజరై అక్కడి తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రవాస తెలుగు ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. మహానాడు కార్యక్రమం సందర్భంగా భారీ సంఖ్యలో తరలివచ్చిన తెలుగు ప్రజలను ఉద్దేశించి హరీష్ బాలయోగి మాట్లాడారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రజలు తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడమే కాకుండా, తెలుగు సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్నప్పటికీ స్వదేశంతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రవాసాంధ్రుల గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. తెలుగు దేశం పార్టీ సిద్ధాంతాలను విదేశాల్లోనూ ప్రజలకు పరిచయం చేస్తూ, పార్టీ ఆలోచనలను విస్తృత స్థాయిలో చాటిచెబుతున్న ప్రవాస నాయకులు, కార్యకర్తల సేవలు ప్రశంసనీయమని హరీష్ బాలయోగి పేర్కొన్నారు. తెలుగు సమాజ అభ్యున్నతికి, యువతలో నాయకత్వ లక్షణాల పెంపొందనకు, సామాజిక ఐక్యతకు మహానాడు వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. మెల్‌బోర్న్ మహానాడు-2026 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న తెలుగు దేశం మెల్‌బోర్న్ అధ్యక్షుడు శ్రీకాంత్ కొనిదెనతో పాటు మోహన్ కమ్మ, ప్రకాష్ సూరపనేని, సుమన్ దాసరి, శ్రీకర్ రావి, సూర్య ఘన్ని, సుమంత్ రెడ్డి, సాయి కృష్ణ, నితిన్ విపర్ల, భరత్ కడియాల, శ్రీకాంత్ సరిపూడి తదితర నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విదేశీ నేలపై తెలుగు ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి మహానాడును విజయవంతంగా నిర్వహించడం వారి అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు ప్రవాస తెలుగు నాయకులు, వ్యాపారవేత్తలు, సామాజిక కార్యకర్తలు హరీష్ బాలయోగిని కలుసుకుని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రవాసాంధ్రుల సంక్షేమం, పెట్టుబడుల అవకాశాలు, విద్యా, ఉపాధి రంగాల్లో సహకారంపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి తమవంతు సహకారం అందించేందుకు ప్రవాస తెలుగు ప్రజలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని వారు తెలిపారు. మహానాడు కార్యక్రమంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు, కళారూపాలు, సాహిత్య కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తెలుగు ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా హరీష్ బాలయోగి పలు అధికారిక సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, ప్రవాస భారతీయ సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల అవకాశాలు, రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసాంధ్రుల భాగస్వామ్యం, విద్యా, పారిశ్రామిక రంగాల్లో సహకారం వంటి అంశాలపై చర్చలు జరపనున్నట్లు సమాచారం. మెల్‌బోర్న్ మహానాడు-2026 కార్యక్రమం విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి తెలుగు జాతి కీర్తిని మరింతగా చాటాలని హరీష్ బాలయోగి పిలుపునిచ్చారు.

# మంత్రి వాసంశెట్టి చొరవతో కుయ్యేరు - కాజులూరు రోడ్డుకు మోక్షం

**రూ.2.78 కోట్ల నిధుల మంజూరు - వారం రోజుల్లో పనులు ప్రారంభం**



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కుయ్యేరు - కాజులూరు రహదారి అభివృద్ధికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో కీలక ముందడుగు పడింది. నిధుల కొరత కారణంగా గత కొంతకాలంగా నిలిచిపోయిన ఈ రహదారి నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం రూ.2.78 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు 12.16 కిలోమీటర్ల పొడవు కలిగిన ఈ రహదారి కుయ్యేరు, కాజులూరు ప్రాంతాల ప్రజలకు ప్రధాన రవాణా మార్గంగా ఉపయోగపడుతోంది. ఈ సమస్యను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి సుభాష్ అధికారులతో సమీక్షలు నిర్వహించడమే కాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారు. ఆయన నిరంతర అనుసరణ, పట్టుదల ఫలితంగానే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులను విడుదల చేసింది. అధికారుల సమాచారం ప్రకారం రహదారి నిర్మాణ పనులు వారం రోజుల్లోపు ప్రారంభం కానున్నాయి. పనులు పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభతరం అవుతుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఈ రహదారి కీలకంగా మారనుంది. ఈ రహదారి నిర్మాణం విషయంలో కొంతమంది వైసీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేసినప్పటికీ వాటిని అధిగమిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో మంత్రి సుభాష్ విజయం సాధించారు. మాటలకే పరిమితం కాకుండా సమస్య పరిష్కారానికి కృషి చేసి నిధులు సాధించడం ద్వారా ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను మరోసారి నిరూపించుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషిని రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, వివిధ వర్గాల నాయకులు అభినందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి వరుసగా కోట్లాది రూపాయల నిధులు తీసుకురావడం ద్వారా మంత్రి సుభాష్ అభివృద్ధి పట్ల తన చిత్తశుద్ధిని చాటుతున్నారని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలే ప్రభుత్వ ప్రాధాన్యత అని, రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి నిరంతరం కొనసాగిస్తాం అని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# శివకుమార్ మృతి బాధాకరం



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో పెనికేరు గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు యర్ర హేమ శివకుమార్ కుటుంబ సభ్యులను కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. శివ కుమార్ నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను కలిసి ప్రమాద ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కొడుకు మరణాన్ని తట్టుకోలేక తీవ్ర దుఃఖంలో ఉన్న తండ్రిని బండారు శ్రీనివాస్ ఓదార్చారు. శివకుమార్ అకాల మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో జనసేన పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని బండారు శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఆయన వెంట స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని శివకుమార్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

# ప్రపంచ సైకిల్ దినోత్సవం




**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ యువజన కార్యాలయం, కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో కోనసీమ జిల్లాలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెద్దబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నాగబత్తుల వెంకట సుబ్బారావు మాట్లాడుతూ యువత శారీరక దృఢత్వం (ఫిట్‌నెస్) పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న ఇంధన ధరలు, భవిష్యత్తులో తలెత్తే ఇంధన కొరతను దృష్టిలో ఉంచుకుని సైకిల్ వినియోగాన్ని, నడకను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.

### రామచంద్రపురంలో రూ.51.90 లక్షలతో

# తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందించే లక్ష్యంతో మొత్తం రూ.51.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న నాలుగు తాగునీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులకు బుధవారం ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి రామచంద్రపురం ఆర్డీవో మరియు మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ సరళావతి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజు తదితరులు హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సరళావతి మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ పనులు పూర్తయితే సంబంధిత వార్డుల ప్రజలకు నాణ్యమైన తాగునీటి కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. అనంతరం కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా చేపడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ రూ.51.90 లక్షల నిధులతో పట్టణంలోని నాలుగు వార్డులలో పైప్‌లైన్ పనులు జరగనున్నాయి. ఇందులో భాగంగా 2వ వార్డు కొత్తూరు రోడ్డులో రూ.3.75 లక్షలతో 23వ వార్డు శివాలయం వెనుక వీధిలో రూ.4.45 లక్షలతో 110 మి.మీ పైప్‌లైన్ ఏర్పాటు పనులు చేపట్టనున్నారు. అలాగే 9వ వార్డు జల్లిపేటలో ద్రాక్షారామ మెయిన్ రోడ్ నుండి శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం వరకు రూ.28.70 లక్షలతో 6వ వార్డు శీలంవారి సావరం మెయిన్ రోడ్డులో మహాత్మానగర్ నుండి పంపన శ్రీనివాస్ ఇంటి వరకు రూ.15.00 లక్షలతో 110 మి.మీ హెచ్‌డిపిఈ పైప్‌లైన్ పనులు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీకాంత్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవల్లి శివ, పలువురు పట్టణ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వేగాయమ్మపేటలో ఉత్సాహంగా టీడీపీ యూనిట్ ఇన్‌చార్జిల సమావేశం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రూరల్ మండలం పరిధిలోని వేగాయమ్మపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ యూనిట్ ఇన్‌చార్జిల విస్తృత స్థాయి సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. అట్టడుగు స్థాయి నుంచి సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రామచంద్రపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ శ్రీ బొమ్ము లక్ష్మణ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని అందరూ ఐకమత్యంతో పనిచేసి పార్టీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ అధినాయకత్వం సూచించిన మార్గదర్శకాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపైనే ఉందన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి మరియు ప్రజా సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కీలక సమావేశంలో గ్రామ బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ కమిటీ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక అంశాలను సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ఈ సమావేశం విజయవంతంగా ముగిసింది.

# 'వెన్నుపోటుకు రెండేళ్లు' పోస్టర్ ఆవిష్కరణ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం గడచిన రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిందని విమర్శిస్తూ రామచంద్రపురం పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ శ్రీ పిల్లి సూర్య ప్రకాష్, పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్యకర్తల చేతుల మీదుగా ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం నియోజకవర్గ ఇంచార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ.. గత రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలను తీవ్రంగా ఎండగట్టారు. అలాగే రామచంద్రపురం నియోజకవర్గంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలు మరియు స్థానిక అంశాలపై ఆయన తన అభిప్రాయాలను వెల్లడించి ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి సుబ్బారావు, మండల మరియు పట్టణ కన్వీనర్లు పోలినాటి వరప్రసాద్, గాదంశెట్టి శ్రీధర్, జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు చిల్లి నాగేశ్వరరావు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్ కుమారి, పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు మల్లిడి సాయి లక్ష్మి, పట్టణ మాజీ కౌన్సిలర్లు, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### పేద కుటుంబానికి

# పెద్దన్నగా నిలిచిన మంత్రి సుభాష్

**బెంగళూరులో మృతిచెందిన యువకుడి పార్థివదేహం స్వగ్రామానికి తరలింపు**



**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజవర్గం, కె.గంగవరం మండలం శేరులంక గ్రామానికి చెందిన చింతలపూడి సాయి దుర్గారావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పేదరికాన్ని జయించి కుటుంబాన్ని పోషించాలనే లక్ష్యంతో కష్టపడి బీటెక్ పూర్తి చేసిన సాయి.. తన తండ్రి శ్రీనివాస్ దివ్యాంగుడు కావడంతో కుటుంబ భారాన్ని మోసేందుకు బెంగళూరు వెళ్ళాడు. అక్కడ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూనే డెలివరీ బాయ్‌గా పార్ట్‌టైమ్ పనిచేస్తుండగా దురదృష్టవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. మారుమూల గ్రామం నుంచి మెట్రో నగరానికి వెళ్లి ప్రాణాలు కోల్పోవడంతో ఆ యువకుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషాద ఘటన గురించి స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్రంగా చలించిపోయి తక్షణం స్పందించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం గ్రీవెన్స్ సెల్ ఇన్‌చార్జ్ ఆనంద్ ద్వారా కర్ణాటకలోని టీడీపీ నాయకులతో సమన్వయం చేసుకున్నారు. బెంగళూరులో ఉన్న సాయి దుర్గారావు మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామమైన శేరులంకకు తరలించేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బాధిత కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు మంత్రి పలు చర్యలు చేపట్టారు. సాయి పనిచేస్తున్న సంస్థతో మాట్లాడి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.50,000 ఆ కుటుంబానికి అందేలా చూశారు. అలాగే ప్రమాదానికి కారణమైన కర్ణాటక ఆర్టీసీతో పాటు అతను పనిచేస్తున్న సంస్థ నుంచి కూడా కుటుంబానికి తగిన నష్టపరిహారం అందేలా కృషి ప్రారంభించారు. దీనికి తోడు మంత్రి సుభాష్ తన వ్యక్తిగత బాధ్యతగా మరో రూ.50,000 ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. సాయి అంత్యక్రియల్లో పాల్గొని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పేందుకు ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంతరాయ్‌తో కూడిన బృందాన్ని మంత్రి స్వయంగా శేరులంకకు పంపించారు. కుటుంబ పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండటాన్ని గుర్తించిన ఆయన మృతుడి సోదరి చింతలపల్లి మహాలక్ష్మి చదువు బాధ్యతను కూడా తీసుకున్నారు. ఇంటర్ పూర్తి చేసిన ఆమెకు ఉద్యోగం వచ్చే వరకు చదివిస్తానని హామీ ఇచ్చి ఆ కుటుంబానికి కొండంత భరోసా కల్పించారు. చేతికొచ్చిన కొడుకును కోల్పోయి శోకసంద్రంలో ఉన్న పేద కుటుంబానికి పెద్దన్నలా సాయం చేసి ఆదుకున్న మంత్రి సుభాష్‌ను రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా ప్రశంసిస్తున్నారు. ప్రజా నాయకత్వానికి, మానవత్వానికి మంత్రి చర్యలు నిదర్శనంగా నిలిచాయని కొనియాడుతున్నారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com



# తహసిల్దార్ కార్యాలయ సిబ్బందిపై జేసీ సీరియస్...!

**అత్యధిక సిబ్బంది గైర్హాజరు**
**కొన్ని దస్త్రాల నిర్వహణ అస్తవ్యస్థం**
**ఇంకా పూర్తి కాని జనగణన, భూ రీ సర్వే**
**ప్రతి చర్యలు తప్పవని ఊహాగానాలు**
**వారం రోజుల్లో ప్రతి చర్యలు ఉండొచ్చు**

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరంలోని తాహసిల్దార్ కార్యాలయ సిబ్బందిపై జిల్లా జాయింట్ కలెక్టర్ (జె.సి), అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ అపూర్వ భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది గైర్హాజరు, కార్యాలయం నిర్వహణ, సిబ్బంది హాజరు నిర్వహణ, పరిసరాల పారిశుద్ధ్యంపై ఆయన తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. తాహసిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఉదయం 11 గంటలకు ఆకస్మికంగా సందర్శించారు. వస్తూనే నేరుగా కార్యలయ ఆవరణలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో చెట్లు, చేమల చెత్తా చెదారం పేరుకుని ఉండిపోయి పారిశుధ్యానికి అసలు సిసలు చిరునామాగా దర్శనం ఇవ్వడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. ఈ పారిశుద్ధ్యం గురించి ఎంపీడీవో. యు.నాగేంద్రతో మాట్లాడేందుకు జాయింట్ కలెక్టర్ చరవాణీలో ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు. దీంతో ఆయన కార్యాలయంలోనికి గదులను, దస్త్రాలను, హాజరు పట్టీని పరిశీలించారు. ఈ సమయంలో కేవలం తాహసిల్దార్ అల్లాడి తాతారావు, ఎలక్షన్ ఆఫీసర్ నాగం సూర్య వెంకట రామారావు, కంప్యూటర్ ఆపరేటర్ కట్టు రాజ్ కుమార్... ఈ ముగ్గురు సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన ఆయన హాజరు పట్టిలోన పేర్ల ప్రకారం సిబ్బంది గైర్హాజరుపై ఆరా తీశారు. డిప్యూటీ



తాహసిల్దార్ కిరణ్ కుమార్ సలాది కుమార్ ఆన్ డ్యూటీ ట్రైనింగ్ పై కలెక్టర్ కార్యాలయంలో ఉన్నారని, అలాగే సీనియర్ అసిస్టెంట్ (ఆర్ఐ) ఉప్పు దుర్గా బాలాజి రమణమూర్తి కంప్యూటర్ల మరమ్మతులకు కాకినాడ వెళ్ళారనీ అందుబాటులో సిబ్బంది జె.సి.కి తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తాహసిల్దార్ కిరణ్ కి జెసి. ఫోన్ చేయగా తాను ఇంకా మార్గం మధ్యలో కత్తిపూడిలో ఉన్నానని బదులిచ్చారు. కంప్యూటర్ ఆపరేటర్ కట్టు రాజ్ కుమార్ మాత్రం తాను హాజరు వేసుకోకుండా విధుల్లో నిమగ్నమై పోవడాన్ని జె.సి. ప్రశ్నించారు. తానెప్పుడూ ముందుగానే హాజరు వేసుకుంటాను సార్, కానీ ఈ రోజే ఇలా... అని రాజ్ కుమార్ బదులిచ్చారు. భూముల రీ సర్వే, జనగణన ఇంకా పూర్తి కాకపోవడం, సిబ్బంది విధుల్లో అలసత్వం, దస్త్రాలను సరిగ్గా నిర్వహించకపోడం, కార్యాలయం ఆవరణలో పారిశుద్ధ్యం వంటి మొత్తం విషయాలపై జె.సి. సీరియస్ అయ్యారు. రీ సర్వే డిప్యూటీ తాహసిల్దార్ కిరణ్ పై బాగా కోప్పడ్డారని సమాచారం. మొత్తం సిబ్బందిని తీవ్రంగా హెచ్చరించారని సమాచారం. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అపూర్వ భరత్ కోటనందూరు మండలం పర్యటనకు వెళుతూ మార్గం మధ్యంలో శంఖవరం తాహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ సందర్శించి తనిఖీ చేయడంతో సిబ్బంది ఊహించని రీతిలో జె.సి.కి కొన్ని అవాంఛనీయ పరిస్థితుల్లో దొరికిపోయారు. ఏతావాతా ఇక్కడి రెవిన్యూ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఎవరూ చెప్పకనే ఇట్టే జెసి. పసిగట్టారు. సిబ్బంది చర్యలకు జెసి. ప్రతిచర్యలు ఉండే అవకాశం లేకపోలేదు. కొంత మంది సిబ్బందిపై మూడు నుంచి వారం రోజుల్లో జె.సి. క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉందని మండలంలో ఊహాగానాలు రెక్కలు తొడుక్కున్నాయి.

# కనీస అభ్యసన స్థాయిలపై వృత్యంతర శిక్షణ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉపాధ్యాయులు తమ వృత్తిలో కొనసాగుతూ, తమ నైపుణ్యాలను, జ్ఞానాన్ని మరింత పెంపొందించు కోవడానికి కనీస అభ్యసన స్థాయిలపై వృత్యంతర శిక్షణ ఇస్తున్నారు. మారుతున్న కాలం, సాంకేతికతకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరును మెరుగు పరచడం ఈ వృత్యంతర శిక్షణ ముఖ్య ఉద్దేశం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 1, 2వ తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు 4 నుండి 9 వ తేదీ వరకు ఆరు రోజులు పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. కాకినాడ జిల్లా తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు సంబంధించి శంఖవరం, ప్రత్తిపాడు, రౌతులపూడి, తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు సుమారు 300 మందికి శంఖవరం మండలం కత్తిపూడిలోని జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కనీస అభ్యసన స్థాయిలు (ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసి) అనే అంశంపై వేసవి వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శంఖవరం ఎంఈఓ. సూరిశెట్టి వెంకట రమణ బుధవారం సాయంత్రం ఒక మీడియా ప్రకటనలో తెలిపారు.

### జె.అన్నవరం పీహెచ్‌సీ నిర్మాణ పనులను

# పరిశీలించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం జె.అన్నవరం గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి.ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రత్యేక చొరవతో నిర్మితమవుతున్న ఈ భవనం త్వరలో ప్రజలకు అందు బాటులోకి రానుంది.ఈ సందర్భంగా ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) గ్రామస్తులతో కలిసి పీహెచ్‌సీ భవనాన్ని సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు.భవనం నాణ్యత,సౌకర్యాలను పరిశీలించిన గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ భవన నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జితో పాటు గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.పీహెచ్‌సీ అందుబాటులోకి రావడం ద్వారా జె.అన్నవరం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వైద్యులు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ర్యాలీ గ్రామంలో ఆపరేషన్ వజ్రప్రహార్.. భారీ కార్డన్ సెర్చ్

**అసాంఘిక శక్తులపై పోలీసుల ఉక్కుపాదం - ఆత్రేయపురం పరిధిలో ముమ్మర తనిఖీలు**
**గంజాయి నిర్మూలన లక్ష్యంగా పోలీసుల ప్రత్యేక ఆపరేషన్**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట సబ్ డివిజన్‌లోని ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలో "ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు తెల్లవారుజాము నుంచే ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఆపరేషన్ వజ్రప్రహార్" కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగం అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపింది. నేరాలను అరికట్టడం, ప్రజా భద్రతను పటిష్టం చేయడం లక్ష్యంగా జిల్లాలోని పలు కీలక ప్రాంతాల్లో భారీ కార్డన్ సెర్చ్‌లు నిర్వహించారు. కొత్తపేట సబ్ డివిజన్‌లోని ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ర్యాలి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున విస్తృత




స్థాయిలో సోదాలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌ను కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఈగల్ వింగ్ సీఐ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. వీరితో పాటు ఆత్రేయపురం ఎస్సై రాము, రావులపాలెం ఎస్సై చంటిబాబు, కొత్తపేట అదనపు ఎస్సై వెంకటేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి ప్రతి ఇంటిని, అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ మాట్లాడుతూ గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే ప్రధాన లక్ష్యమన్నారు. యువతకు గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. దొంగ వాహనాలను కొనుగోలు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నా లేదా విక్రయిస్తున్నా వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసలైన వ్యక్తులు సమాజంలో భయాందోళనలు సృష్టించే అవకాశం ఉందని, మహిళలు మరియు బాలికలపై వేధింపులు, ఇతర నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. అలాంటి వారిని గుర్తించి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలో నేరాలకు తావులేకుండా చేయడమే లక్ష్యమని ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. ఆపరేషన్ వజ్రప్రహార్ ద్వారా అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు భయపడకుండా పోలీసులకు సహకరించాలని, ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే 100 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

### డాక్టర్ అంజి నాయక్ పుట్టినరోజు సందర్భంగా

# భోజనం ప్యాకెట్లు అందజేత



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు దేవర్ష్ హాస్పిటల్ ఇంచార్జ్ డాక్టర్ అంజి నాయక్ జన్మదినం సందర్భంగా ఆయన సతీమణి డాక్టర్ విజయ,కుటుంబ సభ్యుల సహకారంతో బుధవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఏలేశ్వరం బ్రాహ్మణ భోజనం హోటల్‌ఊబేత శ్రీనివాస్, దోనేపూడి శ్రీను,పొన్నగంటి సత్తిబాబు సహకారంతో ఏలేశ్వరం బాలాజీ చౌక్ సెంటర్లో వివేకానంద సేవా సమితి అధ్యక్షులు మైర్యాల నాగేశ్వరరావు, సభ్యులు ఆధ్వర్యంలో సుమారు 100 మందికి భోజన పొట్లాలు మరియు టవల్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు పెండ్యాల రాజు,మల్లి బాబు, రాజబాబు, దాసరి కృష్ణ, రాజశేఖర్, పిరట్ల రవి, గొల్లపూడి త్రిమూర్తులు, జగన్, కంచర్ల రమేష్, డోర్స్ రమేష్, మెడికల్ షాప్ లక్ష్మణ్, బ్లడ్ టెస్ట్ గణేష్, నీలి పాండురంగ, హరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం మండలంలో జె.అన్నవరం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న శ్రామికులకు ఏలేశ్వరం ఎంపీపీ, కాకినాడ జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని శ్రామికుల ఆరోగ్య రక్షణ కోసం శ్రీ సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ మండుటెండల్లో కష్టపడి పనిచేస్తున్న ఉపాధి హామీ శ్రామికులకు కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.శ్రామికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,వారి ఆరోగ్యం,భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు,గ్రామ టీడీపీ నాయకులు,ఉపాధి హామీ సిబ్బంది,ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మునికూడలిలో స్వచ్ఛ పథం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ-ఆంధ్ర స్వర్ణాంధ్ర సంకల్పంలో భాగంగా సీతానగరం మండలం ముని కూడలి గ్రామంలో స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ ప్రారంభించారు. స్వయంగా ఆయనే చేతితో చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేస్తూ గ్రామస్తులను చైతన్యంతో నింపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో ప్రతి ఒక్కరి భాగస్వా మ్యం కీలకమని మన ఊరిని పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం భారతి,డిప్యూటీ ఎంపీడీవోలు కె.వి.వి.ఎస్ మూర్తి, ఎం.వి.రెడ్డి, ఏఓ సుబ్రహ్మణ్యం, పంచాయతీ సిబ్బంది,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మునికూడలి సర్పంచ్ సతీమణి మృతి పట్ల

# సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం మునికూడలి గ్రామ సర్పంచ్ ఆరుమల్లి సత్యనారాయణ సతీమణి ఆరుమల్లి సత్యవతి ఇటీవల స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకున్న రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మునికూడలి గ్రామంలోని సర్పంచ్ నివాసానికి చేరుకుని, సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం, సర్పంచ్ ఆరుమల్లి సత్యనారాయణతో పాటు వారి కుటుంబ సభ్యులను కలిసి, వారిని ఓదార్చి తన తీవ్ర సంతాపాన్ని మరియు సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యా న్ని ప్రసాదించాలని, ఆమె ఆత్మకు సద్గతి కలగాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రార్థించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంగంపాలెంలో పులి బీభత్సం

**13 దూడలు మృతి, భారీగా అటవీ శాఖ బృందాల మోహరింపు**



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవీపట్నం మండలం గంగంపాలెం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున పులి దాడి చేసి 13 దూడలను చంపడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. సంఘటన సమాచారం అందుకున్న వెంటనే ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ముఖ్య వన్యప్రాణి సంరక్షకులు ఎన్. నాగేశ్వరరావు, రాజమండ్రి ముఖ్య అటవీ సంరక్షకురాలు డాక్టర్ జ్యోతి, రాంపచోడవరం డీఎఫ్ఓ ఎన్. రామచంద్రరావు తదితర అధికారుల పర్యవేక్షణలో సుమారు 100 మంది సభ్యులతో కూడిన 19 హనుమాన్ బృందాలు రంగంలోకి దిగాయి. ఇందులో ర్యాపిడ్ రెస్క్యూ, ప్రజా అవగాహన, ట్రాంక్విలైజింగ్, డ్రోన్, కేజ్, వన్యప్రాణి అంబులెన్స్ బృందాలు ఉన్నాయి. పులి సంచారం నేపథ్యంలో గ్రామస్తులకు అప్రమత్తత సూచనలు జారీ చేసిన అధికారులు, పశువులను కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల భద్రత దృష్ట్యా పోతవరం-దండంగి రహదారిని తాత్కాలికంగా మూసివేసి రాకపోకలను నియంత్రిస్తున్నారు. పరిస్థితిని అటవీ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు అవసరం లేకుండా బయటకు రావద్దని అధికారులు సూచించారు.

# హెచ్‌ఆర్‌ఏజే నూతన కార్యాలయం ప్రారంభం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో ఏర్పాటు చేసిన హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (హెచ్‌ఆర్‌ఏజే) కోనసీమ జిల్లా నూతన కార్యాలయాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆ సంస్థ జాతీయ చైర్మన్ మరియు వ్యవస్థాపకుడు నందం నరసింహారావు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కట్టా సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో నందం నరసింహారావు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన లక్ష్యంగా హెచ్‌ఆర్‌ఏజే నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా సంస్థ విశేష కృషి చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో మహిళల భద్రత, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ కోసం సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి బాధితుడికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "మీ సమస్య... మా పరిష్కారం" అనే నినాదంతో ప్రజలకు అండగా నిలుస్తూ సేవలు అందించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని ఇతర సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా కోఆర్డినేటర్ కోయ్య సతీష్, లీగల్ అడ్వైజర్లు నిమ్మగడ్డ విజయ్, రవ్వ చంద్రశేఖర్, రవికిరణ్, ఆర్గనైజేషన్ సెక్రటరీలు కట్టా ఆనంద్, ఎల్. రాఘవేంద్ర, జిల్లా మీడియా సెక్రటరీలు రాంప్రసాద్, జి.వి. రాజు, సాయి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు వి. తాతాజీ, వెల్ఫేర్ సెక్రటరీ కె. నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## రూ. 52 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేస్తాం
## 10వ డివిజన్ అభివృద్ధికి శ్రీకారం - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో నిర్లక్ష్యానికి గురైన 10వ డివిజన్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే రూ.11 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. 10వ డివిజన్ పరిధిలోని ఏపీఎస్ఈబీ ఫంక్షన్ హాల్ నుంచి వీఎల్ పురం జంక్షన్ వరకు రూ.73 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, తెలుగుదేశం పార్టీకి సంప్రదాయంగా మద్దతు ఇచ్చే ప్రాంతమనే కారణంతో గత పాలకులు అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం 10వ డివిజన్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేశామని చెప్పారు. ఇప్పటికే సుమారు రూ.4 కోట్ల విలువైన 25 అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ.2 కోట్ల పనులు ప్రారంభ దశలో ఉండగా, రూ.4 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. అదనంగా రూ.1 కోటి విలువైన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ రోజు ప్రారంభించిన సీసీ రోడ్డు నగరంలో అత్యంత రద్దీగా ఉండే, ప్రజలకు కీలకమైన కనెక్టివిటీ కల్పించే రహదారి అని అన్నారు. గతంలో నిధుల కొరత కారణంగా రోడ్డు పనులు కొంతవరకే పూర్తయ్యాయని, ఇప్పుడు మిగిలిన భాగాన్ని కూడా పూర్తి స్థాయిలో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏ పని ప్రారంభించినా పూర్తి చేసి చూపిస్తుందే తప్ప మధ్యలో వదిలిపెట్టదని స్పష్టం చేశారు.

**52 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్**

ఈ ప్రాంతంలో ఉన్న లారీ స్టాండ్ స్థలాన్ని క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగిస్తూ మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం "ఖేలో ఇండియా" పథకం కింద రెండో దశ పనులకు రూ.13 కోట్ల నిధులు మంజూరు చేసి, కాంట్రాక్టర్‌కు అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. మరో పది రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అదేవిధంగా తొలి దశలో రూ.28 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని, రెండు నెలల్లో వాటి ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మూడో దశకు కూడా రూ.11 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ఎంపీ పురంధేశ్వరి కృషి చేస్తున్నారని వెల్లడించారు. మొత్తం మూడు దశల్లో రూ.52 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించి యువతకు అంకితం చేస్తామన్నారు.

**క్రీడా రంగానికి మరింత ప్రోత్సాహం**

రాజమహేంద్రవరాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఇటీవల జిల్లా అధికారులతో సమావేశమై యువ క్రీడాకారుల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదించారని చెప్పారు. అర ఎకరం స్థలం కేటాయిస్తే తమ సొంత నిధులతో నెట్ ప్రాక్టీస్ బాక్సులు, శిక్షకులను ఏర్పాటు చేస్తామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ముందుకు వచ్చిందన్నారు. పురుషులతో పాటు మహిళా క్రికెటర్ల కోసం ప్రత్యేక మహిళా కోచ్‌ను కూడా నియమించే ప్రతిపాదన ఉందని తెలిపారు. దీంతో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. కార్పొరేషన్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరిన వెంటనే ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

**అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం లక్ష్యం**

నగరానికి భవిష్యత్తులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియాన్ని కూడా తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా యంత్రాంగం కలిసి కృషి చేస్తున్నట్లు ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. తగిన స్థలం గుర్తించిన వెంటనే ఈ ప్రతిపాదనను కార్యరూపం దాల్చేలా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ, నగరాన్ని అభివృద్ధి, క్రీడా రంగాల్లో ఆదర్శంగా నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలి

## ప్రజా సమస్యలపై టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించిన మంత్రి ఎస్.సవిత, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రజల నుంచి పలు ఫిర్యాదులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు , వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.రాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మంత్రి ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని, ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే



పరిపాలన అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని ముందుకు సాగుతోందని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత చొరవ చూపాలని కోరారు.

## రాజమహేంద్రవరానికే తలమానికంగా

# ముని కూడలి పుష్కర ఘాట్ : బత్తుల

## నియోజకవర్గంలో 15 స్నానఘాట్ల అభివృద్ధికి ప్రతిపాదనలు - పుష్కర భక్తుల దృష్ట్యా పది పంచాయతీ పుష్కర వనాలు ఏర్పాటు



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం 2027 పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పక్క ప్రణాళికను తయారు చేస్తూ ముందస్తు చర్యలు చేపట్టిందని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని సీతానగరం మండలంలోని మునికూడలి ఘాటును శాసనసభ్యులు బత్తుల, అధికారులు, ఎన్డీఏ నాయకులు సందర్శించి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు చేపట్టవలసిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ఎన్డీఏ రెండేళ్ల పాలనలో అభివృద్ధి,సంక్షేమంతో పాటు ఆంధ్రుల చిరకాల స్వప్నం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, మన రాజధాని అమరావతి శరవేగంగా పనులు జరుగుతున్నాయని దీనంతటికీ ప్రధాన కారణం ప్రధానమంత్రి మోడీ అని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పవిత్ర గోదావరి నది తీరాన ఎంతో చారిత్రాత్మక ప్రదేశమైన మునికూడలి ఘాట్లో మునులందరూ స్నానజపాదులు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభేలుతుండే దన్నారు. మరల అటువంటి వైభవాన్ని తీసుకురావడానికి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కంకణం కట్టుకున్నారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం 2027 పుష్కరాలలో స్నానమాచరించే భక్తులకు పవిత్ర గోదావరి జలాలను అందించేందుకు 100 కోట్ల రూపాయలతో పేపర్ మిల్లు, తదితర వ్యర్థాలను శుద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అదేవిధంగా రాజానగరం నియోజకవర్గంలో భక్తుల సౌకర్యార్థం 15 స్నాన ఘట్లను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశాలతో ముని కూడలి ఘాటును రాజమహేంద్రవారానికే తలమానికంగా, ఆదర్శ ఘాటుగా తీర్చిదిద్దుతామన్నారు. మునికూడలి ఆధ్యాత్మిక విశిష్టతను వివరిస్తూ సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో 10 పుష్కర పంచాయతీ వనాలు ఏర్పాటు చేసి, భక్తులకు అన్ని వసతులు కల్పన, దాతలు ప్రభుత్వ ఆధ్వర్యంలో భోజన వసతి, సుమారు 25 వేలమంది పుష్కరాల్లో సేవలు అందించేందుకు పక్కా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. పుష్కరాల్లో ప్రతిరోజు సుమారు 50వేల మంది భక్తులు పైబడి రావచ్చని, అదనంగా రెండు టెలిప్యాడ్ లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2027 పుష్కరాలు రాజానగరం నియోజకవర్గానికి ఆధ్యాత్మికంగా అత్యంత కీలకం కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, కే విజయ్ శంకర్, గెడ్డం త్రిమూర్తులు, మద్దాల యేసు పాదం, కందికట్ల అరుణకుమారి, అడ్డాల శ్రీను, మేడిశెట్టి శివరాం, బదిరెడ్డి దొర, యర్రంశెట్టి పోలారావు,అడపా శ్రీనివాస్, ముక్క రాంబాబు, వలవల రాజా, తనకాల నాగేశ్వరరావు, పుప్పాల వెంకటరత్నం,అడపా వీరబాబు, వివిధ శాఖల అధికారులు, పలువు ఎన్డిఏ నాయకులు పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వం పొగాకు

# రైతులకు అండగా ఉంటుంది

### ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం ముని కూడలి గ్రామంలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన గ్రామంలోని పొగాకు ఉత్పత్తి కేంద్రానికి వెళ్లి, స్థానిక పొగాకు రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం, పొగాకు రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పర్య టనలో భాగంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పొగాకు ఉత్పత్తి కేంద్రంలో పని చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లారు. ఈ పర్యటన కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సీతానగరం గ్రంధాలయం నందు

# 30వ రోజు వేసవి విజ్ఞాన తరగతులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం శాఖ గ్రంథాలయము నందు వేసవి విజ్ఞాన తరగతులు బుధవారం 30 రోజులకు చేరుకున్నట్లు గ్రంథపాలకుడు టి.అరుణ్ కుమార్ తెలిపారు. ముందుగా విద్యార్థులకు పుస్తక సమీక్ష పుస్తక పఠనం నిర్వహించి చదరంగం క్విజ్ వంటి పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం హాజరైన విద్యార్థులకు కూల్ డ్రింక్స్ మరియు చాక్లెట్లను పంపిణీ చేశారు.

# నాన్-క్యాడర్ ఎస్పీగా ఏ.వి.సుబ్బరాజు పదోన్నతి


### ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన సుబ్బరాజు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందిన ఏ.వి.సుబ్బరాజు నేడు తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయంలో నాన్-కేడర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్.పీ)గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంగళవారం క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# రాష్ట్రస్థాయి అవార్డులకు గిరిజన విద్యార్థులు ఎంపిక





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు గిరిజన విద్యార్థులు విద్యా ప్రతిభతో రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి జిల్లా టాపర్లు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూన్ 5న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డులు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, బొమ్మూరులో చదివిన చల్లా తులసి సత్య మాధవి పదో తరగతిలో 558 మార్కులు సాధించి జిల్లా టాపర్ గా నిలిచి అవార్డుకు ఎంపికైందన్నారు. అలాగే ఇంటర్మీడియట్ ఎంపీసీ (ఎంపీసీ) విభాగంలో టి.చందు 934 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించి ప్రత్యేక అవార్డుకు ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా బయోపీసీ విభాగంలో గంగల్ల గాయత్రి 952 మార్కులతో జిల్లా టాపర్ అవార్డుకు ఎంపికైందని తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులు జూన్ 5న నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఇతర గిరిజన విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆమె అభినందించారు.

# ఆదిత్య ఎంబీఏ విభాగాధిపతి వి.వి ప్రతిమకు డాక్టరేట్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదిత్య బిజినెస్ స్కూల్ ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.వి ప్రతిమకు ఆంధ్ర యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ డిపార్ట్మెంట్ డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ తెలియజేశారు. డాక్టర్ వివి ప్రతిమ హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్మెంట్ ఇన్ రిటైల్ సెక్టార్- ఏ స్టడీ ఆన్ ఎంప్లాయిస్ పర్స్పెక్టివ్ అనే అంశం మీద ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జాలాది రవి ఆధ్వర్యంలో తీసిస్ను సబ్మిట్ చేసి పిహెచ్డి డిగ్రీ పొందినందుకు కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్ శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్ సుగుణ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు, డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, అధ్యాపక అధ్యాపకేతర మరియు విద్యార్థులు అభినందించారు.

# పుష్కరాలకు మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి : షేక్ నిజాం



**రాజమహేంద్రవరం, నేటి వార్త :** 2027లో గోదావరి పుష్కరాల రానున్న సందర్భంగా నగర అభివృద్ధి మరియు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయడం కొరకు కేంద్ర ప్రభుత్వం నుండి పుష్కరల నిధులు కేటాయించడం జరుగుతుంది కాబట్టి కూటమి ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు రాజమండ్రి పరిసర ప్రాంతాలైన కాతేరు, గణపతి నగర్, మిలిటరి కాలనీ, శాంతినగర్ పలు ప్రాంతాలలో ఇప్పటి వరకు మంచి నీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు గురి అవుతున్న విషయం అందరికి తెలిసినదే గోదావరి నది ప్రక్కనే ఉన్న మంచి నీటి కొరకు ప్రజలు, మహిళలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నరని ఆయన అన్నారు అయితే పుష్కర నిధుల లేదా ప్రభుత్వ నిధుల నుండి ఈ ప్రాంతాలలో ప్రతి ఇంటికి మంచి నీటి కుళాయి ఏర్పాటు చేయాలనీ కూటమి ప్రభుత్వాన్ని నిజాం డిమాండ్ చేశారు.







# రామ్ చరణ్ స్పెషల్ ఫుడ్ డైట్..!

## పహిల్వాన్ లుక్ కోసం చరణ్ ఎంత కష్టపడ్డారంటే..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ పెద్ది.. ఈ సినిమా రిలీజ్ మరికొన్ని గంటల్లోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ అందరూ ఈగర్‌గా ఎదురుచూస్తున్నారు. ఉప్పెన సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు బుచ్చిబాబు సన డైరెక్షన్ లో ఈ సినిమా తెరకెక్కుతుంది. రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమా మరికాసేపట్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం మెగా అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విలేజ్ బ్యాక్డ్రాప్ తో బుచ్చుబాబు అద్భుతమైన కథను తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్ దగ్గర నుంచి సాంగ్స్, టీజర్, ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. పెద్ది సినిమాలో రామ్ చరణ్ మాస్ లుక్ లో కనిపించనున్నాడు. అలాగే చరణ్ ఈ సినిమాలో ఓ ఆట కూలీగా కనిపించనున్నాడని టాక్ వినిపిస్తుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ లో చరణ్ క్రికెట్ ఆడటం, కుస్తీ పోటీల్లో పాల్గొనడం చూపించారు. ఇక ఈ సినిమాలో చరణ్ పహిల్వాన్ లుక్‌లో అదరగొట్టనున్నారు. కండలు తిరిగిన దేహంతో చరణ్ లుక్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. గద పట్టుకొని రామ్ చరణ్ లుక్ చూడగానే అందరికి హనుమంతుడిలా కనిపించారు. పహిల్వాన్ లుక్ లో చరణ్ అద్భుతమైన ఫైట్ సీన్ కూడా ఉందని తెలుస్తుంది. అయితే చరణ్ పెద్దిలో పహిల్వాన్ లుక్ లో కనిపించడానికి చాలా కష్టపడ్డారు. ఇటీవలే సినిమా కోసం పహిల్వాన్ లుక్ కోసం చేసిన వారౌట్స్ ను ఓ వీడియో రూపంలో విడుదల చేశారు. అయితే చరణ్ పహిల్వాన్ లుక్ కోసం ఎలాంటి డైట్ ఫాలో అయ్యారో తెలుసా.? 'పెద్ది' సినిమా కోసం పహిల్వాన్ లుక్ అలాగే క్రాస్‌ఓవర్ అథ్లెట్‌గా మారడానికి , రామ్ చరణ్ శాకాహార డైట్‌తో పాటు కార్బ్ సైక్లింగ్ (1,800 నుంచి 2,500 కేలరీలు) పాటించాడట. రామ్ చరణ్ ట్రైనర్ రాకేష్ ఉద్దియార్, మాంసాహార ప్రోటీన్లపై ఆధారపడకుండా అవసరమైన కండరాలను పెంచడానికి ఒక స్వచ్ఛమైన, దేశీయ పోషకాహార విధానాన్ని తయారు చేశారట. శాకాహార ప్రోటీన్: భోజనంలో మొక్కల ఆధారిత ప్రోటీన్లు, పప్పులు, పాల ఉత్పత్తులు (పనీర్ మరియు పాలు వంటివి), అలాగే చిక్కుడు జాతి గింజలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారట.. అలాగే చరణ్ తన మాక్రోలపై సంపూర్ణ నియంత్రణ ఉండేలా చూసుకోవడానికి, బయట తినడం మానేసి, కేవలం ఇంట్లో వండిన శాకాహార భోజనానికే కట్టుబడి ఉన్నాడట. అలాగే హైడ్రేషన్, ఎలక్ట్రోలైట్స్: సాంప్రదాయ పానీయాలు (మజ్జిగ వంటివి) అలాగే తాజా కూరగాయలు అధిక శక్తితో కూడిన కుస్తీ సెషన్‌లకు అవసరమైన హైడ్రేషన్ అలాగే పోషకాలను అందిస్తాయి. వీటితో పాటు సరైన వర్కౌట్స్ ద్వారా రామ్ చరణ్ పహిల్వాన్ లుక్‌లోకి మారారు. రేపు థియేటర్స్‌లో చరణ్ పహిల్వాన్‌గా దుమ్మురేపనున్నారు.

# తెలుగులో ఆ హీరో నా ఫేవరేట్..

## అతడితో నా స్క్రీన్ కెమిస్ట్రీ బెస్ట్.. ఇలియానా కామెంట్స్..

ఇలియానా డిక్రూజ్ .. ఒకప్పుడు టాలీవుడ్‌ను ఒక ఊపు ఊపిన గోవా బ్యూటీ. తనదైన నడుము వంపులతో, గ్లామర్‌తో కుర్రకారు మనసు దోచుకుని, టాలీవుడ్‌లో 'ఇలియానా క్రేజ్' అనే కొత్త ట్రెండ్‌ను సృష్టించింది. ఒక దశాబ్దం పాటు సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్‌గా వెలిగి, ఆ తర్వాత బాలీవుడ్‌లోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటుంది. ఒకప్పుడు టాలీవుడ్‌ను ఊపేసిన స్టార్ హీరోయిన్ గోవా బ్యూటీ ఇలియానా. తనదైన గ్లామర్,



నటనతో కుర్రకారు గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఈ అమ్మడు.. తెలుగులో దాదాపు అందరు అగ్ర హీరోలతోనూ స్క్రీన్ షేర్ చేసుకుంది. మొదటి సినిమాతోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ముఖ్యంగా మహేష్ బాబు సరసన ఆమె నటించిన పోకిరి చిత్రం ఇలియానా కెరీర్ మలుపు తిప్పింది. ఈ మూవీతో ఆమెకు అవకాశాలు క్యూ కట్టాయి. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఇలియానా.. ఇప్పుడు తన ఇద్దరూ కుమారులతో కలిసి ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇందులో ఇలియానా టాలీవుడ్ స్టార్ హీరోలపై చేసిన కామెంట్స్ నందమూరి అభిమానులను తెగ ఖుషీ చేస్తున్నాయి. ఈ వీడియోలో యాంకర్ ఇలియానాను ఒక ఆసక్తికరమైన ప్రశ్న అడిగారు. "మీరు నటించిన హీరోల్లో.. జూనియర్ ఎన్టీఆర్ (తారక్), రామ్, మహేష్ బాబు, ప్రభాస్.. వీరిలో ఎవరితో మీ స్క్రీన్ కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అయిందని మీరు అనుకుంటున్నారు?" అని ప్రశ్నించారు. దీనికి ఇలియానా కాసేపు ఆలోచించి "నేనైతే తారక్ అనే చెప్తాను. తారక్‌తోనే నా స్క్రీన్ కెమిస్ట్రీ బెస్ట్" అంటూ ఎన్టీఆర్ పేరును ప్రత్యేకంగా ప్రస్తావించింది. జూనియర్ ఎన్టీఆర్, ఇలియానా కాంబినేషన్‌లో కృష్ణవంశీ దర్శకత్వంలో 'రాఖీ', అలాగే మెహర్ రమేష్ దర్శకత్వంలో 'శక్తి' సినిమాలు వచ్చాయి. ముఖ్యంగా 'రాఖీ' సినిమాలో వీరిద్దరి మధ్య వచ్చే లవ్ ట్రాక్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తారక్ ఎనర్జీకి మ్యాచ్ అవుతూ ఇలియానా అప్పట్లో చేసిన డ్యాన్స్ స్టెప్స్ కూడా ఒక ఊపు ఊపాయి. మహేష్ బాబుతో 'పోకిరి', ప్రభాస్‌తో 'మున్నా', రామ్‌తో 'దేవదాసు' వంటి భారీ హిట్స్ ఉన్నప్పటికీ.. నటన, టైమింగ్ విషయంలో తారక్‌తో ఉన్న కంఫర్ట్ లెవెల్స్ వేరని ఇలియానా చెప్పకనే చెప్పింది. ఇలియానా చేసిన ఈ కామెంట్స్ పాతవే అయినప్పటికీ, ప్రస్తుతం ఎన్టీఆర్ గ్లోబల్ స్టార్‌గా దూసుకుపోతున్న తరుణంలో ఈ వీడియోను తారక్ ఫ్యాన్స్ నెట్టింట విపరీతంగా షేర్ చేస్తూ ట్రెండ్ చేస్తున్నారు.

# ఏక్ బిహారీ సబ్ పే భారీ.. నెట్టింట హల్‌చల్ చేస్తున్న విరాట్ కోహ్లీ పవర్‌ఫుల్ డైలాగ్

గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్ ముగిసిన తర్వాత సోషల్ మీడియాలో ఒక వీడియో తెగ వైరల్ అయ్యింది. అందులో కింగ్ విరాట్ కోహ్లీ ఈ 15 ఏళ్ల కుర్రాడిని కలిసి ఎంతో ఆప్యాయంగా మాట్లాడటం కనిపించింది. వీరిద్దరూ అంత సీరియస్‌గా ఏం మాట్లాడుకున్నారనే దానిపై అభిమానుల్లో ఎన్నో అంచనాలు, ఊహాగానాలు సాగాయి. నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 5 వికెట్ల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జడీ) ఘన విజయం సాధించింది. వరుసగా రెండో ఏడాది కూడా ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడి సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. అయితే ఈ గ్రాండ్ ఫైనల్ మ్యాచ్ ముగిసిన తర్వాత అందరి దృష్టిని ఆకర్షించిన ఒక స్పెషల్ పర్సన్ ఉన్నాడు. ఆయనే 15 ఏళ్ల బీహార్ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ. ఈ వండర్ కిడ్ ఐసీసీ చైర్మన్ జై షాతో కలిసి వీఐపీ స్టాండ్స్‌లో కూర్చొని మ్యాచ్‌ను వీక్షించాడు.

**వైరల్ వీడియో గుట్టు విప్పిన ఆర్సీబీ**

గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్ ముగిసిన తర్వాత సోషల్ మీడియాలో ఒక వీడియో తెగ వైరల్ అయ్యింది. అందులో కింగ్ విరాట్ కోహ్లీ ఈ 15 ఏళ్ల కుర్రాడిని కలిసి ఎంతో ఆప్యాయంగా మాట్లాడటం కనిపించింది. వీరిద్దరూ అంత సీరియస్‌గా ఏం




మాట్లాడుకున్నారనే దానిపై అభిమానుల్లో ఎన్నో అంచనాలు, ఊహాగానాలు సాగాయి. ఈ ఉత్కంఠకు తెర దించుతూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మేనేజ్‌మెంట్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో పూర్తి వీడియోను షేర్ చేసింది. ఇందులో కోహ్లీ ఆ కుర్రాడికి ఇచ్చిన అద్భుతమైన సలహా అందరినీ ఆకట్టుకుంటోంది.

**కోహ్లీ ఇచ్చిన పవర్‌ఫుల్ సలహా ఇదే**

వైభవ్ సూర్యవంశీ భుజంపై చేయి వేసి విరాట్ కోహ్లీ హిందీలో మోటివేట్ చేశాడు. "నువ్వు ఇక్కడి నుంచి ఇంకా పైకి ఎదగాలి. నీ కష్టానికి తగిన ప్రతిఫలం ఇప్పుడు దక్కింది. బయట ఎవరు ఏం మాట్లాడినా అస్సలు వినొద్దు. మైదానంలో కేవలం నువ్వు, నీ బ్యాట్ మాత్రమే ఉండాలి. ఒక బీహారీ అందరి కంటే గొప్ప (ఏక్ బిహారీ సబ్ పే భారీ).. అంతే గేమ్ ఖతమ్" అంటూ కోహ్లీ ఆ చిన్నారి క్రికెటర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపాడు. భారత క్రికెట్‌లో దూకుడును నేర్పిన విరాట్, భయం లేకుండా బ్యాటింగ్ చేసే వైభవ్‌కు ఇచ్చిన ఈ సలహా నెటిజన్ల మనసులు గెలుచుకుంటోంది.

**ఐపీఎల్ 2026ను శాసించిన సూర్యవంశీ**

ఈ ఐపీఎల్ సీజన్ విజేతగా ఆర్సీబీ నిలిచినప్పటికీ, 2026 సీజన్ మాత్రం వైభవ్ సూర్యవంశీ పేరుతోనే గుర్తుండిపోతుంది. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ లీగ్‌లో సునామీ సృష్టించాడు. ఈ సీజన్‌లో ఏకంగా 16 ఇన్నింగ్స్‌లు ఆడి 776 పరుగులు సాధించి ప్రతిష్టాత్మక ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో ఆరెంజ్ క్యాప్ గెలిచిన ప్లేయర్‌గా వైభవ్ సరికొత్త రికార్డు సృష్టించాడు. కేవలం ఆరెంజ్ క్యాప్ మాత్రమే కాకుండా ఫైనల్ ముగిసిన తర్వాత మరో నాలుగు అవార్డులను కూడా కైవసం చేసుకుని, మొత్తం రూ.55 లక్షల ప్రైజ్ మనీని గెలుచుకున్నాడు.

# ఫ్యాన్స్‌కు పూనకాలే.. కింగ్ కోహ్లీ, హిట్ మ్యాన్ ఎంట్రీ డేట్ ఫిక్స్.. అప్పుడే ప్రాక్టీస్ షురూ




భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య జూన్ 6 నుంచి ఒకే ఒక్క టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ ముగియగానే వన్డే సిరీస్ మొదలవుతుంది. తాజా సమాచారం ప్రకారం.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జూన్ 9న ముల్లాన్‌పూర్‌లో అడుగుపెడతారు. ఐపీఎల్ 2026 హంగామా ముగియగానే టీమిండియా మళ్లీ ఇంటర్నేషనల్ క్రికెట్ మూడ్‌లోకి వచ్చేసింది. అఫ్గానిస్థాన్‌తో జరగనున్న కీలకమైన వన్డే సిరీస్ కోసం సీనియర్ స్టార్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఎప్పుడు జట్టుతో కలుస్తారనే దానిపై క్లారిటీ వచ్చేసింది. జూన్ 9 నుంచి ముల్లాన్‌పూర్ వేదికగా వీరిద్దరూ కఠినమైన నెట్ ప్రాక్టీస్ మొదలుపెట్టనున్నారు. భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య జూన్ 6 నుంచి ఒకే ఒక్క టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ ముగియగానే వన్డే సిరీస్ మొదలవుతుంది. తాజా సమాచారం ప్రకారం.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జూన్ 9న ముల్లాన్‌పూర్‌లో అడుగుపెడతారు. జూన్ 9 నుంచి 11 వరకు మూడు రోజుల పాటు వీరు నెట్స్‌లో చెమటోడ్చనున్నారు. ఆ తర్వాత, జూన్ 13న ధర్మశాలలో జరిగే మొదటి వన్డే కోసం టీమిండియాతో కలిసి అక్కడికి చేరుకుంటారు.

**మిషన్ 2027 వరల్డ్ కప్ లక్ష్యంగా..**

ఈ వన్డే సిరీస్ కేవలం ఒక ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కాదు, 2027 వన్డే వరల్డ్ కప్‌కు సన్నాహకంగా జట్టు భావిస్తోంది. 2023 వరల్డ్ కప్ ఫైనల్లో తృటిలో చేజారిన టైటిల్‌ను ఈసారి ఎలాగైనా ముద్దాడాలని రోహిత్, కోహ్లీ కసితో ఉన్నారు. తమ కెరీర్ చివరి దశలో ఉన్న ఈ ఇద్దరు దిగ్గజాలు, తమ ఫిట్‌నెస్, ఫామ్‌ను కాపాడుకోవడానికి ఈ సిరీస్‌ను కీలకంగా భావిస్తున్నారు.

**నెట్ బౌలర్ల సందడి.. మయాంక్ యాదవ్ ఎంట్రీ**

ఈ ప్రాక్టీస్ సెషన్స్ కోసం బీసీసీఐ ప్రత్యేకంగా ఆరుగురు నెట్ బౌలర్లను ఎంపిక చేసింది. ఇందులో ఐపీఎల్ 2026లో తన వేగంతో అదరగొట్టిన మయాంక్ యాదవ్ కూడా ఉన్నాడు. అఫ్గాన్ బ్యాటర్లను ఎదుర్కోవడానికి టీమిండియా సిద్ధమవుతుంటే, మన బ్యాటర్లకు పదును పెట్టడానికి మయాంక్ వంటి స్పీడ్‌స్టర్లు సాయపడనున్నారు. ఇప్పటికే వన్డే జట్టులోకి ఎంపికైన ప్రిన్స్ యాదవ్ కూడా రోహిత్, కోహ్లీలతో కలిసి ధర్మశాల వెళ్లనున్నాడు.

**కోహ్లీ జోష్.. రోహిత్ కసి**

విరాట్ కోహ్లీ ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి టైటిల్ గెలవడంలో కోహ్లీ కీలక పాత్ర పోషించాడు. టోర్నీలో 675 పరుగులు చేసి సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ కెప్టెన్ రోహిత్ శర్మకు ఐపీఎల్ ఈసారి ఆశించిన స్థాయిలో సాగలేదు. మరోవైపు రోహిత్ శర్మకు ఐపీఎల్ 2026 అంతగా కలిసిరాలేదు. ముంబై ఇండియన్స్ జట్టు హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ఘోరంగా విఫలమై పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో నిలిచింది. రోహిత్ కేవలం 9 ఇన్నింగ్స్‌లలో 283 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కేకేఆర్, లక్నోలపై ఆడిన రెండు ఇన్నింగ్స్‌లు మినహా మిగతా మ్యాచ్‌ల్లో నిరాశపరిచాడు. ఈ ఐపీఎల్ పరాజయాల కసిని అఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్‌లో చూపించాలని హిట్మ్యాన్ పట్టుదలతో ఉన్నాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com